




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 151 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | మంగళవారం - 21 - జులై - 2026 | వెల రూ. 5 /-


# ఒకవైపు వర్షాలు, మరోవైపు సమావేశాలు


## రెండూ దేశానికి మేలు చేయాలి : ప్రధాని మోదీ



- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని ఆశాభావం వ్యక్తం చేసిన ప్రధాని
- దేశ యువత ఆకాంక్షలు, సామర్థ్యం అంతరిక్షం లానే అనంతమైనవని కొనియాడిన మోదీ
- తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగాన్ని విజయవంతం చేసిన స్కైరూట్ యువతపై ప్రశంసలు

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. ఈ వర్షాకాలం, అలాగే పార్లమెంట్ సమావేశాలు రెండూ దేశానికి ఫలప్రదంగా ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ యువత సాధిస్తున్న అద్భుత విజయాలను కొనియాడుతూ, వారి సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలె అనంతమైనవని ప్రశంసించారు. "వర్షాకాలం అయినా, వర్షాకాల సమావేశాలైనా రెండూ చాలా ఫలప్రదమైనవి. ఈ రెండూ ఫలవంతంగా సాగినప్పుడు దేశ సంక్షేమానికి, సర్వ జీవుల సంక్షేమానికి మేలు జరుగుతుంది. అందుకే ఈసారి కూడా రెండూ సఫలం కావాలని కోరుకుంటున్నాను" అని ప్రధాని అన్నారు. గత నెలలో దేశం జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాలలో అనేక మైలురాళ్లను అధిగమించిందని..

» 2




## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో

# స్మార్ట్ రేషన్ కార్డులు..

### - 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగి పోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా ...

» 2

## తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి లేదు

### - కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

» 2



## కాక్రోచ్ పార్టీ 'చలో పార్లమెంట్'తో

### ఢిల్లీలో ఉద్రిక్తత.. లాఠీచార్జ్

- కాక్రోచ్ జనతా పార్టీ 'చలో పార్లమెంట్'లో ఉద్రిక్తత
- జంతర్‌మంతర్‌కు చేరిన 8 వేల మంది నిరసనకారులు
- ర్యాలీపై పోలీసుల నిషేధం
- స్వల్ప లాఠీచార్జ్, మెట్రో స్టేషన్ల మూసివేత

» 2

## ముడి చమురుకు మళ్లీ రెక్కలు..

## 90 డాలర్ల మార్క్ దాటిన బ్యారెల్ ధర



- 90 డాలర్ల మార్క్ దాటిన బ్రెంట్ క్రూడ్
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం
- హర్మూజ్ జలసంధిపై సరఫరా ఆందోళనలు
- ఎంసీఎక్స్‌లో రూ.8,120కు క్రూడ్
- వరుస సైనిక చర్యలతో మార్కెట్‌లో కలవరం
- ధరలు మరింత బలపడే అవకాశముందన్న నిపుణులు

వివరాలు 2 లో ☞

## హైదరాబాద్‌లో టెక్కీ ఆత్మహత్య



- బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య
- మద్యంలో విషం కలుపుకుని తాగినట్లు పోలీసుల అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రాజేంద్రనగర్ పోలీసులు

» 2

## విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ



- పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థుల భారీ నిరసన
- పార్లమెంట్ వైపు వెళుతున్న ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- విద్యార్థులపై దాడి అప్రజాస్వామికమని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శ

» 2




## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్..

# 'క్యూడెంగా'కు ఆమోదం!

- భారత్‌లో తొలి డెంగీ వ్యాక్సిన్‌కు ఆమోదం
- నాలుగు రకాల డెంగీ వైరస్‌ల నుంచి రక్షణ
- మూడు నెలల వ్యవధిలో రెండు డోసులు
- ప్రయోగాల్లో ఆస్పత్రి చేరికలను 84 శాతం తగ్గించిన వైనం
- దేశీయ తయారీతో ధర తగ్గే అవకాశం

» 2

# ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్..

## మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

- హైదరాబాదులోని జాతీయ పోలీసు అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్
- శానిటైజర్ తాగి ఆత్మ హత్యాయత్నం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి
- లేఖతో ఆసక్తికర అంశాలు తెరపైకి!



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆ త్మహ త్యాయ త్నానికి పాల్పడటం, ఆ తర్వాత ఆయన రాశారని చెబుతున్న ఒక లేఖ వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తమ మధ్య ఉన్నది ఏకపక్ష వేధింపులు కావని, అది పరస్పర అంగీకారంతో కూడిన సంబంధమని... తామిద్దరం ఏడాదిగా రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన ఆ నోట్‌లో పేర్కొనడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ ....

2

### తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో
# స్మార్ట్ రేషన్ కార్డులు..

**మొదటిపేజీ తరువాయి..** అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

**ఒకేసారి మూడు నెలల బియ్యం**

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

### తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు
# అనుమతి లేదు

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది.

# విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ

**మొదటిపేజీ తరువాయి..** పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు.

# కాక్రోచ్ పార్టీ 'చలో పార్లమెంట్'తో ఢిల్లీలో ఉద్రిక్తత.. లాఠీచార్జ్

**మొదటిపేజీ తరువాయి..** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజున ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'చలో పార్లమెంట్' పిలుపుతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనకు వేలాది మంది తరలివచ్చారు. జంతర్‌మంతర్ పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ర్యాలీకి అనుమతి నిరాకరించినప్పటికీ నిరసనకారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల అంచనా ప్రకారం జంతర్‌మంతర్ వద్ద సుమారు 8 వేల మంది నిరసనకారులు గుమిగూడారు. కీలక రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. అల్లర్ల నియంత్రణకు ప్రత్యేక వాహనాలను కూడా రంగంలోకి దించారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ర్యాలీకి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ముందుగానే ప్రకటించారు. పార్లమెంట్ వైపు కదిలేందుకు నిరసనకారులు ప్రయత్నించడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీలోని ఐదు మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేశారు.

# ఒకవైపు వర్షాలు, మరోవైపు సమావేశాలు..

**మొదటిపేజీ తరువాయి..** ఈ విజయాల పరంపర దేశ పౌరులలో గర్వాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో యువత సాధిస్తున్న విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతేడాది వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్నారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్‌కు చెందిన 'స్కైరూట్ ఏరోస్పేస్' అనే సంస్థ 'మిషన్ ఆగమన్' కింద దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు. "స్కైరూట్‌లో పనిచేస్తున్న యువత సగటు వయసు కేవలం 28 సంవత్సరాలు. నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు, 28 ఏళ్ల సగటు వయసున్న యువత గురించి మాట్లాడుతున్నాను. వీరు అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకాన్ని సగర్వంగా ఎగరవేశారు" అని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ఆమోదం పొందుతోందని ప్రధాని వివరించారు. "ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. ఇదొక శక్తిమంతమైన సందేశం. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలె అపరిమితమైనవి అనడానికి ఇంతకంటే స్ఫూర్తిదాయకమైన సందేశం మరొకటి ఉండదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో దేశంలో సాధించిన ఇతర విజయాలను కూడా ప్రధాని గుర్తుచేశారు. రాజస్థాన్‌లో భారీ ఆయిల్ రిఫైనరీని జాతికి అంకితం చేయడం, దేశంలో మూడో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించడం, ప్రపంచంలో అతికొద్ది దేశాల వద్ద మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత రైలును అందుబాటులోకి తీసుకురావడం వంటివి జరిగాయని తెలిపారు. "ఈ విజయాలన్నీ భారతదేశ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, కార్మికుల అంకితభావానికి నిదర్శనం. వీరంతా దేశం కోసం కలిసికట్టుగా పనిచేస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో టెక్కీ ఆత్మహత్య

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సుధాకర్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యంలో విషం కలుపుకుని అతడు ప్రాణాలు తీసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సుధాకర్ తన నివాసంలోని బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే వారు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు.

# ముడి చమురుకు మళ్లీ రెక్కలు..
## - 90 డాలర్ల మార్క్ దాటిన బ్యారెల్ ధర

**మొదటిపేజీ తరువాయి..** అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలగొచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దీంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర సోమవారం దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్లను దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా సెంట్రల్ కమాండ్ వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌కు చెందిన లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు సోమవారం ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడి చమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ధరలు ఇప్పటికే గణనీయంగా పెరగడంతో మధ్య మధ్యలో స్వల్ప స్థిరీకరణ కూడా కనిపించవచ్చని విశ్లేషిస్తున్నారు.

# ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్..
## మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

**మొదటిపేజీ తరువాయి..** (SVPNPA)లో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఎర్రగడ్డ మోతీ నగర్‌లోని బంధువుల నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఎస్ఆర్ నగర్‌లోని జయంతి ఆసుపత్రికి తరలించారు. ఆయన శానిటైజర్ సేవించి ఆత్మహత్యకు యత్నించారని వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు, ఉదయ్ కృష్ణారెడ్డిపై కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల వివాహిత, సహ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జులై 10 మధ్య కాలంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించారని, అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారని ఆరోపించారు. జులై 9న తనపై భౌతికంగా దాడి చేసి, జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమి, కత్తితో బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రైవేట్ వీడియోను తన భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై జాతీయ పోలీస్ అకాడమీ అంతర్గత విచారణ జరిపి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం ఉదయ్‌ను అకాడమీ నుంచి తాత్కాలికంగా పంపించివేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఉదయ్ కృష్ణారెడ్డి రాశారని చెబుతున్న లేఖ వెలుగులోకి వచ్చింది. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తమ మధ్య ఏడాదిగా రిలేషన్ షిప్ ఉందని ఆయన ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా సంబంధం కొనసాగిందని, ఆమె తన గదికి వచ్చిన వీడియో ఆధారాలు తన మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయం గురించి తాను ఆమె భర్తకు కూడా తెలియజేశానని వెల్లడించారు. ఆమే తన గదికి వచ్చి తలుపు తెరవాలని బెదిరించిందని ఉదయ్ కృష్ణారెడ్డి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి నాయనమ్మ సంరక్షణలో పెరిగారు. 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, ఐదో ప్రయత్నంలో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం అందరి ప్రశంసలు పొందింది. మహిళా అధికారిణి ఫిర్యాదు, ఉదయ్ కృష్ణారెడ్డి లేఖలోని అంశాలపై పోలీసులు రెండు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్.. 'క్యూడెంగా'కు ఆమోదం!

**మొదటిపేజీ తరువాయి..** వర్షాకాలం మొదలైతే డెంగీ భయం వెంటాడటం మనకు కొత్త కాదు. ఏటా వేలాది మంది ఆసుపత్రుల పాలవుతుంటారు. అలాంటి డెంగీ నియంత్రణలో భారత్ కీలక ముందడుగు వేసింది. దేశంలో తొలి డెంగీ వ్యాక్సిన్‌గా జపాన్‌కు చెందిన టకెడా కంపెనీ రూపొందించిన 'క్యూడెంగా'కు 'కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. దీంతో డెంగీ నివారణలో భారత్‌కు మరో కీలక ఆయుధం అందుబాటులోకి రానుంది. భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా డెంగీ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు, జనాభా పెరుగుదల ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటాయని అంచనా. ముఖ్యంగా వర్షాకాలం, ఆ తర్వాతి నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. క్యూడెంగా (టీఏకే-003)ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగీ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్‌వీ-1, డెన్‌వీ-2, డెన్‌వీ-3, డెన్‌వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. చర్మం కింద ఇంజెక్షన్ రూపంలో వేస్తారు. డెంగీ అధికంగా ఉన్న దేశాల్లో సమగ్ర నియంత్రణ వ్యూహంలో భాగంగా దీన్ని వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే సూచించింది. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసులు తయారు చేసే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా తయారీ ప్రారంభమైతే ధరలు తగ్గే అవకాశముందని భావిస్తున్నారు.

## బాసర సరస్వతి సన్నిధిలో వైభవంగా రుద్రహోమం..
### భక్తులకు మహా అన్నదానం

**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపం లోని శివయోగి నిర్మల అంబయ్య సిద్దాంతి సిద్ధాశ్రమంలో ఉన్న కోటి పార్థివ శివలింగం, శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగాల మాసోత్సవాన్ని పుర స్కరించుకొని సోమవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా దీపారాధన, కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం కోటి పార్థివ శివలింగం, శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు మహా రుద్రాభిషేకం, పుష్పార్చన, బిల్వార్చన, గోపూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, భూదాన సంకల్ప పూజలను వేదమంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం నిర్వ హించిన మహా అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానానికి సహకరించిన కోరుట్ల ఆర్యవైశ్య సంఘ సభ్యులు రేగొండ సత్యనారాయణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో రమణారావు, శ్రీనివాస్, ఎంఎస్‌కే ప్రసాద్, లక్ష్మీనరసయ్య, సీహెచ్ కాశీనాథ్, వెంకట సూర్యనారాయణ శాస్త్రి, సోమిశెట్టి గంగాధర్, రేవతి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## యువశక్తికి దిశానిర్దేశం చేస్తున్న చైతన్య కిరణ్

**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్‌కు చెందిన యువ నాయకుడు ఎం. చైతన్య కిరణ్ యువతలో ఉన్న అసమాన శక్తి, సామర్థ్యాలను సమాజాభి వృద్ధి దిశగా మలిచేందుకు కృషి చేస్తున్నా రని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాజంలో నిజమైన రాజకీయ మార్పు రావాలంటే యువతకు దూరదృష్టి కలిగిన నాయకత్వం అవసరమని ఆయన పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, ఆయన ఆలోచనలు యువతను రాజకీయాలు, సామాజిక సేవ వైపు ఆకర్షిస్తున్నాయని అన్నారు. నేటి యువత కేవలం రేపటి భవిష్యత్తు మాత్రమే కాకుండా, దేశానికి సరికొత్త వర్తమానమని పేర్కొన్నారు.యువత తమ ప్రతిభ, ఆలోచనలు, నాయకత్వ లక్ష ణాలతో రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, సమాజంలో మార్పుకు వారే ప్రధాన శక్తిగా నిలవాలని చైతన్య కిరణ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. యువశక్తి సరైన దిశలో ముందుకు సాగితే తెలంగాణతో పాటు దేశ భవిష్యత్తు మరింత బలపడుతుం దని ఆయన అన్నారు.



## బోనకల్‌లో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు శ్రీకారం
### -9 మీటర్ల విద్యుత్ స్తంభాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల పనులకు ఘనంగా శంకుస్థాపన

**బోనకల్, నేటి శుభోదయ :** బోనకల్ గ్రామంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో సోలార్ మీటర్ల కొరకు 9 మీటర్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటు, నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణ పనులకు విద్యుత్ శాఖ అధికారులు, బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గ్రామంలో పెరుగు తున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను చేపట్టడం జరిగిందన్నారు. నూతన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పూర్తయిన అనంతరం తక్కువ వోల్టేజ్ సమస్యలు తగ్గడంతో పాటు, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటు లోకి వస్తుందని తెలిపారు.విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధిలో భాగంగా విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ బానోతు కొండ, విద్యుత్ శాఖ అధికారులు ప్రవీణ్ కుమార్, రాజేష్, గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, షేక్ మీరా సాహెబ్, ఉప్పర శ్రీను మరియు తేలూరి రమేష్ , అంతోటి వెంకటేశ్వర్లు, చిన్న నరసింహ, తోటపల్లి స్వామి, రామాచారి గ్రామ పెద్దలు, నాయకులు, సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సినీ, టెలివిజన్ రంగానికి ఉపయోగపడే సమగ్ర డైరీ ఆవిష్కరణ
### -వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందించిన చలనచిత్ర -టెలివిజన్ డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్, నేటి శుభోదయ :** వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందించిన చలనచిత్ర–టెలివిజన్ డైరీ 2025–2026ను తెలంగాణ మూవీ , టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు ఎ. రాజ శేఖర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు, సినీ, టెలివిజన్, డిజిటల్ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎ. రాజశేఖర్ మాట్లాడుతూ, తెలుగు సినీ, టెలివిజన్, డిజిటల్ రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే చోట అందించే విధంగా ఈ డైరీని రూపొందించడం అభినందనీయమ న్నారు. ఈ డైరీ రూపకల్పనకు కృషి చేసిన విష్ణు బొప్పనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ డైరీ కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు తదితరులకు ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని పేర్కొంటూ, యూనియన్ సభ్యులందరూ తమకు అవసరమైన ప్రతులను యూనియన్ కార్యాలయం నుంచి పొందాలని సూచించారు.సినీ పరిశ్రమలోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఇటువంటి డైరీలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా సినీ రంగానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు.



## గంగుల శ్రీను పెద్దదినకర్మలో ఘనంగా నివాళులు
### -కుటుంబ సభ్యులకు మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ ప్రగాఢ సానుభూతి

**బోనకల్, నేటి శుభోదయ :** బోనకల్ గ్రామానికి చెందిన దివంగత గంగుల శ్రీను పెద్దదినకర్మ కార్యక్రమం సోమవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, మాజీ సహకార సంఘం అధ్యక్షులు గుండపునేని సుధాకర్ రావు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ, గంగుల శ్రీను మరణం గ్రామానికి తీరని లోటని అన్నారు. ఆయన సేవాభావం, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తేలూరి రమేష్, గంగుల పుల్లయ్య, మల్లెల యాలాద్రి, అంతటి శ్రీను మరియు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొని గంగుల శ్రీనుకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామ ర్శించి ధైర్యం చెప్పారు.



## ప్రజాస్వామ్య విలువలను కాపాడుదాం...
### బాధ్యతారహిత వ్యాఖ్యలను ఖండిద్దాం
### - యువజన కాంగ్రెస్

**నిజామాబాద్, నేటి శుభోదయ :** నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుంపల్లి మహేంధర్ నాయక త్వంలో, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, శ్రీమతి ప్రియాంక గాంధీ ల పై సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అభ్యంతర కర, అసభ్యకర మరియు హింసను ప్రేరేపించే వ్యాఖ్యలపై నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ప్రజాస్వా మ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలకు స్థానం లేదని పేర్కొన్నారు.అనుచిత వాక్యాలు మానుకోవాలని లేదంటే చట్టపరమైన శిక్షలు అనుభవించక తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనుపాల్ కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకాశ్ రెడ్డి, రూరల్ ఉపాధ్యక్షులు మోతే నవీన్ రెడ్డి, సొప్పరి వినోద్, రూరల్ ప్రధాన కార్యదర్శి ఆరా ప్రవీణ్, , రూరల్ మండల అధ్యక్షులు సురేష్ నాయక్, జక్రాన్‌పల్లి మండల అధ్యక్షులు వెంకటేష్, సిరికొండ మండల అధ్యక్షులు వీరు ప్రవీణ్, మోపాల్ మండల ఉపాధ్యక్షులు కల్పోల్ వంశీ, జక్రంపల్లి మండల ఉపాధ్యక్షులు మున్నూరు ప్రణయ్,తుంపల్లి మాజీ సర్పంచ్ దేవరాజు,చి మన్‌పల్లి డిప్యూటీ సర్పంచ్ రాజేందర్, యువజన నాయకులు మహిపాల్ ,వంశీ కృష్ణ, హరీష్, మధేష్ తదితరులు పాల్గొన్నారు.






## జగదాంబ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేసిన ఏఎస్ఐ సేవాలాల్ నాయక్



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని జగదాంబ తండా గ్రామానికి చెందిన ఏఎస్ఐ సేవాలాల్ నాయక్ తన సొంత గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పట్ల సామాజిక బాధ్యతను చాటుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల కొరత ఉందని తెలుసుకున్న వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ని సంప్రదించి, తన వంతు సహాయంగా ప్లేట్లు, గ్లాసులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ చేతుల మీదుగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం ఏఎస్ఐ సేవాలాల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలవత్ సుగుణ, ఉపసర్పంచ్ గణేష్ నాయక్, గ్రామ పెద్దలు గంగారం, నీలా బాయి, పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, జిల్లా యువ కాంగ్రెస్ నాయకుడు రవి నాయక్ ఏఎస్ఐ సేవాలాల్ నాయక్ చేసిన సేవలను అభినందిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్యార్థుల సంక్షేమానికి సహకరిస్తున్న సేవాలాల్ నాయక్ సేవలు ఆదర్శ ప్రాయం అని కొనియాడారు

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్



**కామేపల్లి, నేటి శుభోదయ :** కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు కారేపల్లి మండలం గెట్ కారేపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి కోటేశ్వరరావు – ఉమారాణి ల కుమార్తె, కుమారుడు ల ఓనిలా అలంకరణ వేడుక, పంచకట్టు వేడుకకు వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ హాజరై చిన్నారులు సంధ్యారాణి, పార్థు లను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీను, మాజీ ఎంపీటీసీ ల సంఘం అధ్యక్షులు దారావత్ పాండ్య నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు మండేపూడి సత్యనారాయణ, చెరుకూరి రమేష్, చెరుకూరి నర్సయ్య, భూక్య రాంకిషోర్, నాయకులు పాల్గొన్నారు

## కస్తూర్బా పాఠశాలకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి

**-ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ కు జంగయ్య వినతి**



**మిడ్జిల్, నేటి శుభోదయ :**
మిడ్జిల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత దృష్ట్యా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ కు పెరుమాళ్ళ జంగయ్య వినతిపత్రం అందజేశారు. ఇటీవల కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికను ఆమె తల్లి విడిచి వెళ్లిన అనంతరం ఆ అమ్మాయి పాఠశాల నుండి సుమారుగా 11 కిలోమీటర్లు ఉన్న, ఉర్కొండ మండలంలోని గుట్టల్లో ప్రత్యక్షమైంది. ఇది గమనించిన స్థానికులు వెంటనే పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించడంతో వారు అమ్మాయిని తీసుకెళ్లారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

## సర్ -2026 మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్





**ఖమ్మం , నేటి శుభోదయ :**
ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న సర్ –2026 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బిఎల్ఓ లు నిర్వహిస్తున్న మ్యాపింగ్, డిజిటలైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. 30 శాతం కంటే తక్కువ పురోగతి సాధించిన బిఎల్ఓ లను గుర్తించి, పనులు మందగించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలు, ఫీల్డ్ స్థాయి ఇబ్బందులు, వంటి అంశాలపై వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ప్రతి బిఎల్ఓ రోజువారీ లక్ష్యాలను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

## నగర ప్రజలకు మరింత చేరువగా ఖమ్మం నగరపాలక సంస్థ వాట్సాప్ గ్రీవెన్స్ సేవలు

**ఖమ్మం, నేటి శుభోదయ :**
నగర ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన, వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో ఖమ్మం నగరపాలక సంస్థ వాట్సాప్ గ్రీవెన్స్ సేవలను విజయవంతంగా నిర్వహిస్తోంది.నగరంలోని ఏ డివిజన్‌కు చెందిన పౌరుడైనా తమ ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపించి, సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు.వాట్సాప్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించి, పరిష్కార చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రతి ఫిర్యాదు పురోగతిని మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత పౌరునికి ఫిర్యాదు స్థితి (స్టేటస్), తీసుకున్న చర్యల వివరాలను కూడా వాట్సాప్ ద్వారా తెలియజేయడం జరుగుతోంది.ఈ సేవల ద్వారా ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి ప్రత్యక్షంగా రావాల్సిన అవసరం లేకుండా, తమ మొబైల్ ఫోన్ నుంచే ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు, సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగేలా వ్యవస్థ పనిచేస్తోంది. నగరంలోని పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, చెత్త సేకరణ తదితర పౌర సమస్యలపై ఫిర్యాదులు చేయదలిచిన వారు తమ సమస్యకు సంబంధించిన వివరాలు, ఫోటోలు, లొకేషన్‌తో పాటు 8333833696 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని ఖమ్మం నగరపాలక సంస్థ కోరుతోంది. ఇప్పటివరకు వాట్సాప్ గ్రీవెన్స్ ద్వారా మొత్తం 249 ఫిర్యాదులు అందగా, వాటిలో 155 ఫిర్యాదులను పూర్తిగా పరిష్కరించారు. మరో 77 ఫిర్యాదులు వివిధ శాఖల పరిధిలో పరిష్కార దశలో (ప్రోగ్రెస్‌లో) ఉన్నాయి. మిగిలిన ఫిర్యాదులపై కూడా అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకుంటూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పర బాలమ్మ ను పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ

**-త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కుటుంబ సభ్యులకు ధైర్యం**



**బోనకల్, నేటి శుభోదయ :**
బోనకల్ గ్రామానికి చెందిన 11వ వార్డు మెంబర్ ఉప్పర శ్రీను తల్లి ఉప్పర బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, గ్రామ సర్పంచి బానోతు జ్యోతి, మాజీ సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి సుధాకర్ రావు బాలమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలను పాటిస్తూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న బాలమ్మ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో తేలూరి రమేష్, మల్లెల యాలాద్రి , అంతటి శ్రీను మరియు గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనారోగ్యంతో ఉన్న బాలమను త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి 'మాట-మంతి

**-గండగలపాడు మార్గంలో పొలాల్లోకి వెళ్లి భట్టి విక్రమార్క**



**ఖమ్మం, నేటి శుభోదయ :**
గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడిచి వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీలు పడ్డారు. 'అక్కయ్యా.. పథకాలన్నీ అందుతున్నాయా?'పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఎంతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు.

**డిప్యూటీ సీఎం అడిగిన ప్రశ్నలివే**
"అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?" "మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా?" "రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?""అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?"ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ"ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఉపముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలుఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నాయకులు వేదికల పైనుంచి మాట్లాడటం చూస్తాం. కానీ, ఇలా స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా.. కాన్వాయ్ ఆపి, పొలంలోకి వెళ్లి కూలీల కష్టసుఖాలు తెలుసుకోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ప్రజా ప్రభుత్వం' అంటే ఇదేనంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు**




**వైరా, నేటి శుభోదయ :** సిపిఎం వైరా డివిజన్ కమిటీ సమావేశం సోమవారం వైరా బోడేపూడి భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామకాల్లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన నిరసనపై కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న నిరసనకారులను అడ్డుకుని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడేనని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువతపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, విద్యా వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరావు, డివిజన్ నాయకులు మచ్చా మణి, దోంతబోయిన నాగేశ్వరావు, బాణాల శ్రీనివాసరావు, కే. నరేంద్ర, చెర్కుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, కొండబోయిన ఉమావతి, తాత పద్మ, ఏర్పుల రాములు, వజ్జా రామారావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తుము సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులి పురుగుల దినోత్సవం






**ఖమ్మం, నేటి శుభోదయ :**
" జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం" మోప్–అప్ డే,ఖమ్మం నగర పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని క్షేత్రస్థాయిలో డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా పిల్లల్లో నట్టల నివారణే ధ్యేయంగా నిర్వహిస్తున్న, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, మోప్–అప్ కార్యక్రమాన్నిడాక్టర్ డి. రామారావు,సోమవారం క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం నగర పరిధిలోని రస్తోగి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎన్.ఎస్.సి. కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, ఆయన సందర్శించారు. గత వారం నిర్వహించిన ప్రధాన విడతలో వివిధ కారణాల వల్ల, ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేకపోయిన విద్యార్థులకు, ఈ రోజు మోప్–అప్ డే సందర్భంగా టీచర్లు, ఆరోగ్య సిబ్బంది సమక్షంలో మాత్రలు వేయించే ప్రక్రియను డీఎంహెచ్ఓ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ రక్తహీనత నివారణ: పిల్లల కడుపులో ఉండే నులిపురుగులు వారు తినే ఆహారంలోని పోషకాలను హరించి వేస్తాయని, దీనివల్ల పిల్లలు రక్తహీనత పోషకాహార లోపానికి గురవుతారని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని వివరించారు. 100 శాతం లక్ష్యం సాధించాలని,జిల్లాలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి ఒక్క పిల్లవాడికి ఈ మాత్రలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, అంగన్‌వాడీల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బడి బయట,పిల్లలకు కూడా కవర్ చేసేలా సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచన,మాత్రలను నమిలి మింగేలా చూడాలని, ఖాళీ కడుపుతో కాకుండా భోజనం లేదా అల్పాహారం చేసిన తర్వాతే వేయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక పట్టణ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో ఘనంగా వివేకానంద సేవా సమితి చైర్మన్ మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలు



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో ఖమ్మం జిల్లా వివేకానంద సేవా సమితి చైర్మన్ మోత్కూరి నారాయణరావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత, భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జివి), భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్ కలిసి నారాయణ రావు కి గజమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కూరి నారాయణరావు సమాజ సేవను లక్ష్యంగా చేసుకొని ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తు న్నారని, ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో నిండి మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షేక్ ఏడుకొండలు, రుద్ర ప్రతాప్, రాకేష్ దత్త, పిల్లలమర్రి వెంకట్, శ్యామ్, జగన్, ఊరుకొండ ఖాదర్ బాబు, గజ్జల శ్రీనివాస్, ఆర్ హెచ్ బి, ఎస్ ఆర్ హెచ్ బృందం సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని నారాయణరావు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిరుపేదల ఇళ్లల్లో ఉదయించే.. సూర్యుడైన భాస్కరుడు





**మిడ్జిల్, నేటి శుభోదయ :**
మిడ్జిల్ మండలం లాక్య తండాకు చెందిన స్వచ్ఛంద సేవకుడు భాస్కర్ మానవత్వానికి మారుపేరుగా నిలుస్తున్నారు. ఎవరికైనా ఆపద వచ్చిందని తెలిసిన క్షణంలోనే స్పందించడం ఆయన ప్రత్యేకత. నేడు మిడ్జిల్ మండలం చౌటకుంట తండాకు చెందిన సక్రు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ నాయక్ బాధితుడికి 50 వేల ఆర్థిక సహాయం అందించి, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.ఇటీవల పోలేపల్లి గ్రామానికి చెందిన వాటర్‌మ్యాన్ కురుమయ్య కుమారుడు గొంతులో నాణెం (కాయిన్) ఇరుక్కోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలోకి చేరాడు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా బాలుడిని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వెంటనే కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి, తన సొంత ఖర్చులతో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. భాస్కర్ చేసిన ఈ సమయస్ఫూర్తి, మానవతా దృక్పథం వల్ల బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఆర్థికంగా వెనుకబడిన తమ కుటుంబానికి దేవుడిలా అండగా నిలిచి తమ కుమారుడి ప్రాణాలు కాపాడిన భాస్కర్‌కు బాలుడి తండ్రి కురుమయ్య కన్నీటి పర్యంతమై హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ" అని భాస్కర్ మరోసారి నిరూపించారు. నిరుపేదల ఇళ్లలో ఉదయించే సూర్యుడిలా, ఆపదలో ఆపన్న హస్తం అందించే సేవామూర్తిగా భాస్కర్‌కు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆయన చేసిన ఈ సేవ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్




**ఖమ్మం, నేటి శుభోదయ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల వద్ద నుంచి గాంధీ చౌక్ వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ఈరోజు ఎస్ఎఫ్ఐ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నిరసన ప్రదర్శనను నిర్వహించామని దేశవ్యాప్తంగా 22 లక్షలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్షలు రాస్తే ప్రశ్నాపత్రం లీక్ కావడం చాలా దుర్మార్గమని దానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా రాజీనామా చేయాలని పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్టిఏను రద్దు చేయాలని అదే విధంగా 19 రోజులకు పైగా నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్ చుక్ దీక్షను భంగం కలిగించి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఆయన దీక్షకు భంగం కలిగిస్తే అదే దీక్ష ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ సజీ, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐ సి గోష్ తదితరులు దీక్షను చేస్తున్నారని, విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులను వారి మద్దతుదారులను పోలీసులు లాఠీచార్జ్ చేసి బెదిరించడం వారిపైన కాల్పులు జరపడం చాలా దుర్మార్గమని బిజెపి ప్రభుత్వం ప్రధాని ఇప్పటికైనా స్పందించి ఎన్టియేను రద్దుచేసి విద్యా శాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని అన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక ఖమ్మం డివిజన్ అధ్యక్షులు త్రినాథ్ జిల్లా కమిటీ సభ్యులు సింధు నాయకులు లోహిత్ కుమార్, శ్యామ్, హారిక, నిఖిల,,పద్మశ్రీ,అక్షయ, వీక్షణ, శ్రీవిద్య, తరుణి తదితరులు పాల్గొన్నారు.

## నీరే జీవనా దారం అందరికి సంరక్షణ చేయండి

### -మున్సిపల్ కమిషనర్ మేడూరి రామచంద్ర రావు, కౌన్సిలర్ బొర్రా ఉమా దేవి



**వైరా, నేటి శుభోదయ :**
వైరా మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డు, సంత బజారు "జల్ సంచయ్ జన్ భాగిధారి" (జే.ఎస్.జే.బి) 3.0కార్యక్రమం. నిర్వహించారు జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములు కావాలిఅని వైరా మున్సిపాలిటీ పరిధిలోని , భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా కోరారు ఈసందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటివృథాను నివారించాలని, భూగర్భజలాలనుపెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపునీటిసంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలనివిజ్ఞప్తి చేయడమైనది.ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మన మందరం తోడ్పడవచ్చు.నీటిప్రతిబొట్టుఅమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనే ఈకార్యక్రమంవిజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనివిజ్ఞప్తిచేయడమైనది.ఈప్రజాఉద్యమాన్నివిజయవతంచేయడానికి.వైరామున్సిపాలిటీతో కలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగాపాల్గొనినీటిసంరక్షణకు కట్టుబడి ముందుకు రావలసిందిగా పేర్కొన్నారు.కార్యక్రమం లో కమిషన్ ర్ మేడూరి రామచంద్ర రావు కౌన్సిలర్ బొర్రా ఉమా దేవి టీ పి బి ఓ మలేష్ మేనేజర్ సుధీర్ మెప్మా టీ ఏం సి బండారు పల్లి వెంకటేశ్వర్లు మెప్మా ఆర్ పి రమాదేవి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## శానిటేషన్ పనులు ప్రణాళిక ప్రకారమే నిర్వహించాలి -మున్సిపల్ కమిషనర్



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని కవిరాజ్ నగర్ ప్రాంతంలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు, జవాన్‌లతో మాట్లాడి శానిటేషన్ ప్లాన్ అమలుపై ఆరా తీశారు. సోమవారం ఎంతమంది శానిటేషన్ వర్కర్లు విధులకు హాజరయ్యారు, వారు ఏయే ప్రాంతాల్లో పనిచేస్తున్నారు, ఒక్కో ట్రాక్టర్‌కు ఎంతమంది సిబ్బంది కేటాయించారు, ట్రాక్టర్ రూట్ మ్యాప్ ప్రకారమే చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయా అనే అంశాలపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజు ముందస్తుగా రూపొందించిన శానిటేషన్ ప్లాన్‌కు అనుగుణంగానే పనులు నిర్వహించాలని, కేటాయించిన ప్రాంతాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి డివిజన్ పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

## కూసుమంచి డీసీసీబీ శాఖ మేనేజర్ మల్లెల స్రవంతికి అవార్డు



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహించిన శాఖ మేనేజర్ల సమీక్ష సమావేశంలో కూసుమంచి శాఖ మేనేజర్ మల్లెల స్రవంతి ప్రతిభకు గుర్తింపుగా అవార్డును అందుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో శాఖ సాధించిన వ్యాపార వృద్ధి, గోల్డ్ లోన్లు, రికవరీలు, ఖాతాదారుల సేవల్లో చూపిన అత్యుత్తమ పనితీరుకు ఈ పురస్కారం లభించింది. కూసుమంచి శాఖకు ఈ గౌరవం దక్కడం పట్ల బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు హర్షం వ్యక్తం చేశారు. మల్లెల స్రవంతి సాధించిన ఈ విజయం ఇతర శాఖలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## నీట్ లీక్‌కు బాధ్యత వహించి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి -ప్రజా సంఘాల డిమాండ్



**వికారాబాద్, నేటి శుభోదయ :**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సీపీఎం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నీట్ యూజీ పరీక్షలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. నీట్ యూజీ పరీక్ష పత్రాల లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మెడికల్ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ పరీక్షల్లో పారదర్శకత పూర్తిగా లోపించిందని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహణలో వరుసగా వివాదాలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. కేంద్రీకృత పరీక్షల విధానం కారణంగా ఒక ప్రాంతంలో జరిగిన అవకతవకల ప్రభావం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులపై పడుతోందని పేర్కొన్నారు.లక్షల రూపాయలు ఖర్చు చేసి, సంవత్సరాల పాటు కష్టపడి చదువుకున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నీట్ లీకేజీ ఘటనల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.అలాగే సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనం వాంగ్చుక్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేయడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులపై లాఠీచార్జ్ చేయడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులు, నిరసనకారులను వెంటనే విడుదల చేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.నీట్ పరీక్షల్లో పారదర్శకత తీసుకురావడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు వైద్య ప్రవేశ పరీక్షలను నిర్వహించే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్, గోపాల్ రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి అనసూయ, నవీన్, లాలయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు ఎప్పుడు?

### అమర జ్యోతి వద్ద గుర్తింపు కమిటీ సమీక్ష సమావేశంలో మల్కాజ్‌గిరి ఉద్యమకారుల ఆవేదన



**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు కోరారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమర జ్యోతి ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమీక్ష సమావేశానికి వారు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనేక మంది ఇప్పటికీ అధికారిక గుర్తింపుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి పారదర్శకంగా గుర్తింపు కల్పించి, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమ చరిత్రను కాపాడుతూ, నిజమైన ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.సమావేశానికి మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు గంగాధర్ కృష్ణ, కృష్ణమూర్తి గౌడ్, సిద్ది రాములు, కృష్ణ గౌడ్, గోపాల్ ముదిరాజ్, శేఖర్ గౌడ్, నరహరి, శీను, గణేష్, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జే. శీను, చారి తదితరులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యా కమీషనర్ ఆదేశాల మేరకు 2026–27 విద్యా సంవత్సరానికి ఈ నియామకాలు జరుగుతాయాని తెలిపారు. ఖాళీల వివరాలు: తెలుగు 01, ఇంగ్లీష్ 01, కామర్స్ 02, చరిత్ర 01, రాజనీతి శాస్త్రం 01, కంప్యూటర్ శాస్త్రం 01, గణితం 01, రసాయన శాస్త్రం 01, వృక్ష శాస్త్రం 01. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్సి ఎస్టీలకు పీజీలో 50 శాతం మార్కులు ఇతర అభ్యర్థులకు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్,పి హెచ్డీ ఉన్న వారికి నియామకాలలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు అవసరమైన అన్నీ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో సమర్పించాల్సిందిగా కోరారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ తేదిని త్వరలో తెలియచేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## 'గుసుల్ ఖానా', 'లిల్లా ఘర్' లను నిర్మించాలి

### -మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సాదిఖ్ అలీ వినతి



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని త్రీటౌన్ పరిధిలో ఉన్న చారిత్రాత్మక ఈద్గా, ఖబరస్థాన్ వక్ఫ్ భూమిలో ముస్లిం మైనారిటీల అవసరాల కోసం 'గుసుల్ ఖానా', 'లిల్లా ఘర్' నిర్మించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిఖ్ అలీ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. సోమవారం ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 1727లో కుతుబ్‌షాహీ–ఆసఫ్‌జాహీ పాలకుల కాలంలో నిర్మితమైన ఈద్గా, కబరస్తాన్ సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన వక్ఫ్ ఆస్తి అని తెలిపారు. ఇటీవలి కాలంలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలు, గత కొన్నేళ్లుగా సాగుతున్న ఆక్రమణల కారణంగా వక్ఫ్ భూమి పరిరక్షణకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్రమణలను అరికట్టి, వక్ఫ్ ఆస్తిని చట్టబద్ధంగా రక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాన్ని ముస్లిం సమాజ అవసరాల కోసం 'లిల్లా ఘర్'గా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గతంలో మృతదేహాలకు అంత్యక్రియలకు ముందు చివరి స్నానం చేయించే 'గుసుల్ ఖానా'ను కొత్త భవన నిర్మాణం సందర్భంగా తొలగించారని, దానిని అదే ప్రదేశంలో పునర్నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఈద్గా– ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, మహమ్మద్ అబ్దుల్ నబీ, ఆరిఫ్, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు సుభాన్, కూసుమంచి మండల అధ్యక్షుడు హలీమ్, తిరుమలాయ పాలెం అధ్యక్షుడు సయ్యద్ సైదా, హాది తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి -పోలీస్ లను వేడుకున్న బాధితురాలు




**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండా శివారులో ఉన్నటువంటి రేగుల గడ్డ తండ గ్రామ పరిధిలో ధీరావతు పుష్పావతి సోమవారం పోలీస్ స్టేషన్ లో పోలీస్ లను వేడుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... తమ పొలం పక్కన ఉన్నటువంటి రైతు దాదాపుగా రెండు కుంటల భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని సంగతి తెలిసిందే. గత దశాబ్ద కాలంగా జరుగుతున్న గొడవ కు ఇరువురి అంగీకారంతో డిజిటల్ సర్వే చేయగా పక్క రైతు పొలంలో దాదాపు రెండు కుంట్ల వరకు భూమి ఎక్కువ ఉన్నది. అదేవిధంగా మా పొలములో అనగా ధీరావతు పుష్పావతి అయిన నేను బాధితురాలుగా పూర్తి ఆధారాలతో జులై 8వ తారీఖున నేను కొండపల్లి ఎస్సె కు ఫిర్యాదు చేయడం జరిగింది. అప్పటి ఎస్ ఐ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మేము పిలిపించి మాట్లాడుతాం మర్యాదగా రాజీకి వస్తే ఓకే కాగితాల ప్రకారంగా ఉండాల్సిన పొలం అతనికి ఇచ్చి అదీకంగా ఉన్నటువంటి దాదాపు రెండు కుంటల భూమి మీకు ఇప్పిస్తాం అన్నారు. ఒకవేళ వారు ఒప్పుకోకపోతే ఎఫ్ ఐ ఆర్ చేసి కోర్టు కు పంపిస్తాం అన్నారు. కానీ నేటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు.మేము ఇట్టి విషయమై మీకు ముట్టినట్టు మాకు రషీద్ ఇమ్మనగా ఇవ్వలేదు, స్మ్స ద్వారా మీకు సమాచారం ఇస్తాము అనగానే మేము ఇంటికి వచ్చేసాము అన్నారు.హైదరాబాద్ లో గల డీజీపీ కార్యాలయం నుండి మాకు ఫోన్ చేసి మా ఫిర్యాదు వివరాలు అడిగారు మాకు న్యాయం జరిగిందా అని అడిగారు. పోలీస్ స్టేషన్లో మీతో ఎలా ప్రవర్తించారు అని అడిగారు మేము అన్నిటికి సమాధానం చెప్పాము. మీ సమస్య పరిష్కారం కాకపోవటానికి కారణం కూడా అడిగారు కాకపోతే మేము అప్పటి ఎస్సె ట్రాన్స్ఫర్ అయ్యారు. కొత్త ఎస్ఐ వచ్చారెన్నారు. మీరు ఒకసారి వెళ్ళండి ఏమి జరిగిందో మాకు చెప్పండి అన్నారు అదే విధంగా మేము నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ కి సందర్శించి మా ఫిర్యాదు పై ఏం యాక్షన్ తీసుకున్నారూ అని అడగగా, సావు కబురు చల్లగా చెప్పినట్టు మీ కంప్లైంట్ క్లోజ్ చేసాము అని చెప్పి అక్కడ ఉన్నటువంటి రిసెప్షన్ లిస్టులు ఇద్దరూ మాట్లాడటం జరిగింది. మేము ఫిర్యాదు చేశాము మాకు తెలియకుండా మా కంప్లైంట్ ని ఎట్లా క్లోజ్ చేశారు అని అడగగా వారి నుండి సమాధానం లేదు, లేకపోక ఎదురు దాడి చేసి భయపెట్టడం ఫ్రెండ్లీ పోలీస్ ఎక్కడ అని అయోమయంలో మేము సందిగ్గంలో పడ్డామున్నారు. చివరగా ఎస్ఐ కి ఫోన్ చేసి అడిగక ఎస్ఐ సానుకూలంగా విన్నారు వారికి క్లియర్ గా చెప్పడం జరిగింది. పొలములో దాదాపు రెండు కుంటల భూమి ఎక్కువ ఉన్నట్లు డిజిటల్ సర్వే ఆధారాలు మరియు పూర్తి ఆధారాలు కూడా సమర్పించి ఉన్నాం సార్ అని చెప్పాము ఎక్కువ ఉన్న భూమిని మాభూమి మాకు ఇప్పించ మని కోరగా సార్ అవసరమైతే కేస్ ను రీ ఓపెన్ చేస్తాను అని చెప్పడం జరిగింది, కేవలం ఎస్ ఐ స్పందన ఆధారంగా దాదాపు ఇంకొక వారం రోజులు ఓపికతో ఉంటాము, ఒకవేళ మా సమస్య పరిష్కారం కానీ ఎడల తర్వాత మేము తీసుకునే చర్యలు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరుగుతుందని ఇందుమూలంగా తెలియజేస్తున్నాం. ఈరోజు మాకు కొద్దిగా ఉపశమనం కేవలం ఇప్పుడు ఉన్నటువంటి ఎస్ఐ ద్వారానే కలిగినది కానీ అక్కడున్న సిబ్బంది దురుసుతనము మరియు వారి ప్రవర్తనపై మేము చాలా మనోవేదనకు మరియు తీవ్ర మనస్థాపానికి గురి అయ్యామని ఈ విధంగా అందరికీ తెలియజేస్తున్నాము, భవిష్యత్తులో మాలాగా ఎవరు ఇబ్బంది పడకుండా ఉండాలని అందుకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.స్నేహపూర్వక పోలీస్ కు నిదర్శనముగా కేవలం ఎస్ ఐ ఒక్కరే కాదు కింది స్థాయి సిబ్బందిలలో పూర్తి పరీవర్తన రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మేము సీనియర్ సిటిజనుగా భావిస్తున్నాం.

## అనంతగిరిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోరు పనుల ప్రారంభం





**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు అనంతగిరిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా కొత్త బోరు తవ్వకం పనులను సోమవారం ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోరు పనులు త్వరితగతిన పూర్తి చేసి అనంతగిరిపల్లి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావడం కోసం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ వినోద్ కుమార్, మున్సిపాలిటీ డీఈ కొండలరావుతో పాటు టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్యా నాయక్, భాగయ్య, రెడ్డి శేఖర్, బాలరాజు, పాల రాము, శీను, పరశురాం, నరసింహులు, కురువ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

## యువత ఉపాధికి ప్రోత్సాహం..

### మెకానికల్ షాప్‌ను ప్రారంభించిన సర్పంచ్ -ఎదిరె నాగేశ్వర్



**కేశంపేట, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామానికి చెందిన ఆనపూసల నరేష్ ఆధ్వర్యంలో నూతన కార్ మెకానికల్ షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, డిప్యూటీ సర్పంచ్ హరీష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ మాట్లాడుతూ,, ప్రస్తుతం ఎంతోమంది యువకులు ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కష్టపడి, ఆత్మవిశ్వాసంతో పని చేస్తే తప్పకుండా మంచి గుర్తింపు, ఆర్థిక స్థిరత్వం సాధించవచ్చని యువతకు సూచించారు. జీవనోపాధి కల్పించే ఇలాంటి వ్యాపారాలను గ్రామ ప్రజలు ప్రోత్సహించాలని కోరారు.డిప్యూటీ సర్పంచ్ హరీష్ రెడ్డి మాట్లాడుతూ,, గ్రామ యువత ఉపాధి అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. ఆనపూసల నరేష్ తన సేవల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి వ్యాపారంలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వార్డు సభ్యులు ఎదిరే బీరప్ప, మెయిల్ గిరి యాదగిరి, వెంకటాపురం నరసింహ, ఎదిరే వెంకటేష్, ఎదిరే శ్రీకాంత్, మెంట శీను, బాయిగడ్డ శివ, ఆనపూసల కృష్ణయ్య, ఆనపూసల జంగయ్య, తుడుం మల్లేష్, ఆనపూసల శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ఛత్రోన్ కీ గూంజ్' విజయవంతం..

### యువత గొంతుకకు కాంగ్రెస్ అండగా ఉంటుంది -బండి రమేష్



**కూకట్పల్లి, నేటి శుభోదయ :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు భారత జాతీయ కాంగ్రెస్, భారత యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం విద్యార్థులు, యువత భారీగా పాల్గొనడంతో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ, "ఇది యువ భారతం... యువత భవితనే దేశ భవిత" అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల విద్యా వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లిందని, ప్రశ్నాపత్రాల లీకులు, నిరుద్యోగం, ఉన్నత విద్యలో అవకాశాల కొరత వంటి సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, వారి సమస్యల పరిష్కారం కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు.ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, యువత, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకీర్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్, తూము వేణు, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, శ్రీనివాస్ బాబు, సాయిబాబా చౌదరీ, రంగమోహన్, గంధం రాజు, రాజేష్, శంకర్, పులి శివ గౌడ్, రామారావు, సునీల్, శ్రీకాంత్ పటేల్, మైఖేల్, బాలరాజు, సంధ్య రాణి, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఉద్యమిస్తుందని, యువత ఆశయాల సాధనకు ప్రతీ అడుగులోనూ అండగా నిలుస్తుందని నాయకులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలపై ఎంపీ రఘురాంరెడ్డి ఆరా

**న్యూఢిల్లీ, నేటి శుభోదయ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని లోతుగా ప్రశ్నించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ఆరంభం కాగా తొలిరోజే ఆయన అడిగిన ప్రశ్నలు విద్యా రంగంలో ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలపై స్పష్టమైన సమాధానాలను రాబట్టాయి.

**పాఠశాలల్లో ఆడిట్, వసతులపై నిఘా ఏది?**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన నాణ్యత, అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై జాతీయ స్థాయిలో ఆడిట్ నిర్వహిస్తున్నారా అని ఎంపీ ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి స్పందిస్తూ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్, ఉడైస్, అసెస్‌మెంట్స్, పిఎం శ్రీ స్కూల్ క్వాలిటీ మానిటరింగ్ ఫ్రేమ్‌వర్క్, సోషల్ ఆడిట్ వంటి వ్యవస్థల ద్వారా పాఠశాలల పనితీరును పర్యవేక్షిస్తున్నామని వివరించారు.పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇంటర్నెట్ సౌకర్యం, సైన్స్ ల్యాబ్‌ల వంటి వివరాల కోసం ప్రభుత్వం డేటాను ఉపయోగిస్తోందని, రాష్ట్రాల వారీగా ఈ వివరాలను https://udiseplus.gov.in/#/en/page/ వెబ్ సైట్ లో చూడొచ్చని తెలిపారు.

**విద్యార్థికి కనీస బడ్జెట్ కేటాయింపులు ఎప్పుడు?**

ప్రతి విద్యార్థికి కనీస మౌలిక వసతుల కల్పన కోసం నిర్దిష్ట బడ్జెట్‌ను పరిశీలిస్తున్నారా అని ఎంపీ అడిగారు. దీనికి సమాధానంగా, 'సమగ్ర శిక్ష' పథకం కింద రాష్ట్రాలు సమర్పించే వార్షిక ప్రణాళికలు ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు ఆమోదం మేరకు నిధులు విడుదల చేస్తున్నామని కేంద్రం పేర్కొంది.

**ఎన్‌ఈపీ ప్రభావంతో మెరుగుపడ్డ అభ్యాస సామర్థ్యాలు**

నూతన విద్యా విధానం అమలు వల్ల విద్యార్థుల సామర్థ్యాల్లో వచ్చిన మార్పులేమిటని అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ నిపుణ్ భారత్ కార్యక్రమం విద్యార్థుల్లో పునాది అక్షరాస్యతను, సంఖ్యా జ్ఞానాన్ని గణనీయంగా పెంచిందని తెలిపారు.రాష్ట్రీయ సర్వేక్షణ డిసెంబర్ 4, 2024న నిర్వహించిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 74,000 పైగా పాఠశాలల నుండి 21.15 లక్షల మంది విద్యార్థులు, 2.70 లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొన్నగా 2021 నాటి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే తో పోలిస్తే, 2024 సర్వేలో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల్లో గణనీయమైన మెరుగుదల కనిపించిందని మంత్రి వెల్లడించారు. ఈ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను, డాష్‌బోర్డ్ ద్వారా వెబ్‌సైట్ https://dashboard.parakh.ncert.gov.in లో పొందుపరిచినట్లు వివరించారు. మౌలిక వసతులు బాగున్న పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభ మెరుగ్గా ఉందని, కేంద్రం ఈ దిశగా మరిన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.



## ప్రవేట్ పాఠశాల యాజమాన్యులు ప్రభుత్వ నిబంధనలను విద్యాశాఖ మార్గదర్శకాలు పాటించాలి



**వైరా, నేటి శుభోదయ :** వైరా టౌన్ లో నిర్వహించబడే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు తెలియజేయునది సంబంధిత శాఖల అనుమతులు లేకుండా పాఠశాల షిఫ్టింగ్, కొత్త ప్రాంగణంలో నిర్వహణ లేదా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధం. అన్ని అనుమతులు పూర్తిగా పొందిన తరువాతే ఏదైనా కొత్త ప్రాంగణంలో పాఠశాల నిర్వహణ లేదా బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలి. వైరా మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు, విద్యాశాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. గుర్తింపు లేకుండా ఎటువంటి విద్యా కార్యకలాపాలు నిర్వహించకూడదు. గుర్తింపు పొందిన పాఠశాలలు కూడా భవన మార్పిడి లేదా కొత్త ప్రాంగణానికి తరలింపు చేపట్టే సందర్భంలో సంబంధిత అధికారుల అనుమతులు పొందిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించి నిబంధనలను కచ్చితంగా పాటించాలని మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టిప్పర్ యజమానులకు అసోసియేషన్ రూ.20 వేల ఆర్థిక సహాయం

**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :**

ఇల్లందు డివిజన్ టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన రెండు టిప్పర్లు ఇటీవల రోడ్డు ప్రమాదాలకు గురికావడంతో ఆయా వాహనాల యజమానులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.కొత్తగూడెం లోతువాగు సమీపంలో ప్రమాదానికి గురైన టిప్పర్ (నెం. 5003) యజమాని వంకుడోత్ నవీన్‌కు, అలాగే ఏపీ 20 టీబీ 7976 నంబరు గల టిప్పర్ తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురికావడంతో యజమాని జాటోత్ రాజ్‌కుమార్‌కు తలా రూ.10 వేల చొప్పున, మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.టేకులపల్లి మండలం చుక్కలబోడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. నరసింహరావు, ఉపాధ్యక్షుడు బోడ మంగీలాల్ నాయక్, కార్యదర్శి ఎ. వెంకటేష్ బాధిత యజమానులకు ఈ సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో కుమార్, నవీన్, రాజ్‌కుమార్, గుమస్తా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల సుందరీకరణకు రూ.10 వేల ఆర్థిక సహాయం



**కేశంపేట, నేటి శుభోదయ :** కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సుందరీకరణకు కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీసా కరుణాకర్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవన కుమారికి అందజేశారు.ఈ సందర్భంగా బీసా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ,, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని అన్నారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.పాఠశాల అభివృద్ధికి సహకరించిన బీసా కరుణాకర్ రెడ్డికి ప్రధానోపాధ్యాయురాలు పవన కుమారి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగయ్య, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు సభ్యుడు పోగుల నర్సింలు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిటిరెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, పాండురంగారెడ్డి, నారంజి తదితరులు పాల్గొన్నారు.

## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది -డాక్టర్ మెతుకు ఆనంద్

**వికారాబాద్, నేటి శుభోదయ :**

వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్పల్లి మండలం బీరోల్, జిన్నారం గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అమలుపై స్థానిక నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా రైతు సమస్యలను పూర్తిగా విస్మరించిందని, వాతావరణ మార్పులపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.రైతుబంధు అమలులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కొద్దిమందికి మాత్రమే సాయం అందించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు మళ్లీ ప్రజాదరణ పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.త్వరలో భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హౌస్ అరెస్ట్..



**నిజామాబాద్, నేటి శుభోదయ :** అంకాపూర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి మద్దతు తెలిపేందుకు బయలుదేరిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాను సోమవారం పోలీసులు ఇంటి వద్దే అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అనవసర వ్యాఖ్యలతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు.గత రెండున్నర సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులు,అభివృద్ధి కార్యక్రమాలపై తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని,అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధిని వివరించే ధైర్యం కాంగ్రెస్ నాయకత్వానికి ఉందా అని ప్రశ్నించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని,మరోవైపు ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు.అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ వైఖరితో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను,రాజకీయ నాయకులను అడ్డుకోవడం,హౌస్ అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్య అని ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి బీజేపీ సిద్ధంగా ఉంటే,దానిని అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి మద్దతు తెలిపేందుకు బీజేపీ నాయకులు,కార్యకర్తలు వెళ్తుండగా ఎక్కడికక్కడ వారిని అడ్డుకోవడం,అరెస్టులు చేయడం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని అన్నారు.ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని,ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు.

## హెచ్‌బీఎల్, అంబేద్కర్ కాలనీ స్టాప్‌లలో బస్సులు ఆపాలని వినతి

**శామీర్‌పేట, నేటి శుభోదయ :**

హెచ్‌బీఎల్ రిక్వెస్ట్ స్టాప్, అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద బస్సులు నిలపకపోవడంతో నిత్య ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించాలని కోరుతూ అలియాబాద్ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు సోమవారం హకీంపేట్ డిపో మేనేజర్ సరితాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ రెండు స్టాప్‌ల వద్ద బస్సులు ఆగకపోవడం వల్ల ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వివిధ సంస్థలకు వెళ్లే సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై స్పందించిన డిపో మేనేజర్ సరితాదేవి, హెచ్‌బీఎల్, అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు తప్పనిసరిగా ఆగేలా సంబంధిత డ్రైవర్లు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.20ఎస్ ఏం పి టి 1 రిక్వెస్ట్ బస్ స్టాప్ లో బస్సులు నిలపాలని డిపో మేనేజర్ ను కోరుతున్నా కౌన్సిలర్ గాదె వెంకటేష్



## ఆదర్శ విద్యాలయంలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో వైశాలి, ఆదర్శ్ ఘన విజయం





**కేశంపేట, నేటి శుభోదయ :**
కేశంపేటలోని ఆదర్శ విద్యాలయం హైస్కూల్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ (SCP) ఎన్నికల ఫలితాలను సోమవారం పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఎన్నికలు ఉత్సాహభరితంగా జరిగాయి.సీనియర్ కేటగిరీలో వీరమల్ల వైశాలి 103 ఓట్లు సాధించి ఘన విజయం సాధించి స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. బొలగం కావ్య 42 ఓట్లతో రన్నరప్‌గా నిలిచారు. ఎస్లావత్ సందీప్ 33, కర్నెకోట నిఖిల్ కుమార్ 16 ఓట్లు పొందారు. ఈ విభాగంలో మొత్తం 194 చెల్లుబాటు అయ్యే ఓట్లు నమోదయ్యాయి.జూనియర్ కేటగిరీలో జువ్వ ఆదర్శ్ 64 ఓట్లతో విజేతగా నిలవగా, కట్రావత్ నిత్య 58 ఓట్లతో రన్నరప్‌గా నిలిచారు. మంచె హర్షిత్ రామ్ 43, వద్యాల శ్రియాన్ రెడ్డి 28 ఓట్లు సాధించారు. ఈ విభాగంలో మొత్తం 193 చెల్లుబాటు అయ్యే ఓట్లు నమోదయ్యాయి.విజేతలకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో పాల్గొన్న ప్రతి అభ్యర్థిని, ప్రజాస్వామ్య హక్కును వినియోగించి ఓటు వేసిన ప్రతి విద్యార్థిని అభినందించారు. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ ఎన్నికలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించే ఆదర్శ కార్యక్రమంగా నిలిచాయి.

## పీవీ నరసింహారావు ఎక్స్ లెన్సీఅవార్డు గ్రహీత



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :**
భారతరత్న ఇండియా పూర్వ ప్రధాని డాక్టర్ పివి నరసింహారావు 105వ జయంతి సందర్భంగా ,నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాలులో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి,పోచారం గ్రామానికి చెందిన బండి శ్రీరాములు ఆదివారం సాయంత్రం రోజున కళానిలయం సేవా సంస్థ ఆధ్వర్యంలో అవార్డును పలువురు ప్రముఖుల అందజేయడం జరిగింది ,ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ, అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది అదేవిధంగా మన ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ పేద విద్యార్థులకు చేయూతనిస్తూ వారికి పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అందజేయడంతో పాటు పేద విద్యార్థులకు తమ వంతు ఎల్లవేళలా సహాయక సహకారాలు ఉంటాయన్నారు తమను అవార్డుకు ఎంపిక చేసిన కళానిలయం సేవా సంస్థ ఫౌండర్ సురేందర్ కి కృతజ్ఞతలు తెలిపారు

## మలేరియా మాసోత్సవం సందర్భంగా ఉచిత వైద్యారోగ్య శిబిరం



**నిజామాబాద్, నేటి శుభోదయ :**
జూన్–జూలై మలేరియా మాసోత్సవం సందర్భంగా నందిపేట్ మండలం కౌల్‌పూర్ గ్రామపంచాయతీలో మండల వైద్యాధికారి డా.ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యారోగ్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, మలేరియా,డెంగ్యూ పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు.సర్పంచ్ వాణిప్రియ,కార్యదర్శి రోజా సమక్షంలో వర్షాకాలపు వ్యాధులపై అవగాహన కల్పించి,నీరు నిల్వ ఉన్న చోట్ల టెమోఫాస్ స్ప్రే చేశారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రిని సంప్రదించాలని డా.ప్రవీణ్ సూచించారు.

## సదాశివపేట లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి







**సంగారెడ్డి, నేటి శుభోదయ :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథ యాత్రను ప్రారంభించారు.ఈ రథయాత్ర సదాశివపేట దురమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారయణ, పృథ్వీ రాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల సుడిగుండంలో చింతపట్ల గ్రామం

### -సిపిఎం పార్టీ గ్రామ ఉపసర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి







**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :**
యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యల పైన సిపిఎం పార్టీ బృందం పరిశీలన,చింతపట్ల గ్రామ సిపిఎం పార్టీ ఉపసర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో అనేక రకాల సమస్యలు ఎన్నో ఉన్నాయని వాటిని సిపిఎం పార్టీ బృందంతో సోమవారం రోజున గ్రామం మొత్తం తిరిగి పరిశీలన చేసాము అన్నారు. గ్రామంలో అండర్ డ్రైనేజీలు సమస్య ఎంతగానో ఉందని,ఎస్సీ వాడలో అంగన్వాడి నుంచి మొదలుకొని చెక్క లక్ష్మమ్మ ఇంటి వరకు ఈ అండర్ డ్రైనేజీ సమస్య ఇంకా కొనసాగుతూనే ఉంది అన్నారు. అట్లాగే గ్రామంలో వార్డుల వారీగా తిరిగిన క్రమంలో 9వ వార్డులో కనుక చూస్తే వీరబొమ్మల వెంకటయ్య ఇంటి నుంచి ఎస్సీ వాడలో పసుల ఆసుపత్రి వరకు పెద్ద అండర్ డ్రైనేజీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు మూడు దశాబ్దాల నుంచి ఈ అండర్ డ్రైనేజ్ కి మోక్షం ఇప్పటివరకు లేదని దాదాపుగా 20,30 సంవత్సరాల నుంచి ఓపెన్ గా ఉన్నటువంటి ఈ డ్రైనేజీని అధికారులు పట్టించుకోవాలని అన్నారు. ఎస్సీ వాడలో రెండు బోర్లు వాడకంలో లేవు జోగు రాములయ్య ఇంటి వద్ద ఉన్న బోరు బావి వాడుకలోకి తేవాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. బీసీ ఏరియాలో పరిస్థితి ఇంకా అదో పరిస్థితిలో ఉంది అన్నారు. పిరాటి వెంకటయ్య ఇంటి నుంచి కాక్లారం లక్ష్మారెడ్డి ఇంటి వరకు సిసి రోడ్డు ఇప్పటికి పెండింగ్లో ఉంది అన్నారు. మన గ్రామంలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను సిపిఎం పార్టీగా మేము డిమాండ్ చేస్తున్నాము అన్నారు. ఏడో వార్డులో పరిస్థితి వీధిలైట్లు దూరంగా ఉన్నట్టు సిపిఎం పార్టీ బృందం గుర్తించింది మహమ్మద్ షకీల్ ఇంటి నుంచి దేశిడి యాదయ్య ఉంటున్న ఈ ఏరియాలో వీధి తంబాల సమస్య నెలకొన్నది. ఈ సమస్యలు అన్నింటిని ఉన్నత అధికారులు మండల అధికారులు, గ్రామ అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు లేనియెడల సిపిఎం పార్టీ చింతపట్ల గ్రామ శాఖల తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు పిరాటి వెంకటయ్య, ఆలంపల్లి జంగయ్య, చింతపట్ల సిపిఎం శాఖ కార్యదర్శిలు సిహెచ్ సత్యం, కుంటుర గిరికాంత్,అచ్చును రమేష్, మోత్కుపల్లి రమేష్, మస్కు శివలీల గణేష్, కోరింక రమేష్, కొండ్రు శీను, కాకులారం యాదగిరి, జి ప్రభాకర్, నారుమల్ల నరసింహ, జిల్లా శేఖర్, సిద్ద గొని కాటంరాజు, మస్కు ప్రశాంత్ సిపిఎం పార్టీ కార్యకర్తలు తదితర గ్రామ ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని కొనసాగించారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం -నగర కమిటీ సమావేశంలో దండి సురేష్




**ఖమ్మం, నేటి శుభోదయ :** ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి –తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. ప్రజా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు. సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలో కొంత వివక్ష –నెలకొన్నదన్నారు. రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ అత్యంత వేగంగా జరిగిందని అందుకు అనుగుణంగా మౌలిక –వసతుల కల్పన జరగడం లేదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని –ఆయన తెలిపారు. గత ప్రభుత్వం బిపిఎల్ ద్వారా నివాస స్థలాలను ఇచ్చేందుకు నిరాకరించి ఆ జీవోను సైతం రద్దు చేసిందని పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆ –పని చేయలేదని సురేష్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా –సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపు మేరకు ఆగస్టు ఆరు నుంచి 15 వరకు జిల్లాలో పాదయాత్రలు –నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐదు నియోజక వర్గాల పరిధిలో పాదయాత్రలు నిర్వహించడం =జరుగుతుందని ఈ సందర్భంగా స్థానికంగా సమస్యలను గుర్తించి పోరాట కార్యాచరణ రూపొందించుకోవడం –జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో నగర కార్యదర్శి ఎస్కే జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు –మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, –ఎస్కె సైదా, జాకీర్, పి. మోహన్రావు, యాకూబ్ పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# ప్రతీకూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో ఉత్తమం





**నిజామాబాద్, నేటి శుభోదయ :** సూపర్ ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత ప్రతీకూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి హితవు పలికారు.ఈ మేరకు గ్రామగ్రామాన క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళి కపై సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష సమావేశం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్ష తన జరిగింది.సమావేశానికి ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి,ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా,పైడి రాకేశ్ రెడ్డి,తోట లక్ష్మీకాంత్ రావు,రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి,నగర మేయర్ కే.ఉమారాణి,ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్,రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా,నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి,ఆశిష్ సంగ్వాన్,పోలీస్ కమిషనర్ సాయి చైతన్య,ఎస్పీ రాజేష్ చంద్ర,వ్యవసాయ శాస్త్రవేత్తలు,ఉద్యానవన,ఆర్.డబ్ల్యు.ఎస్,భూగర్భ జలాలు,విద్యుత్ తదితర శాఖల అధికారులు,ఆదర్శ రైతులు పాల్గొన్నారు.ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగ ర్, నిజాంసాగ ర్, కౌలాస్ నాల,పోచారం,సింగీతం,కల్యాణి,రామడుగు,అలీసాగర్,మంచిప్ప, మాసాని తదితర ప్రాజెక్టులు,రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు,భూగర్భ జలాల స్థితి,తాగునీటి సరఫరా తీరుతెన్నులు,ప్రత్యామ్నాయ పంటల సాగు,ఆరుతడి పంటలకు అందిస్తున్న ప్రోత్సాహం,విద్యుత్ డిమాండ్ – సరఫరా తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా చర్చించారు. తక్కువ నీటితో ఏయే పంటలను సాగు చేయవచ్చు,ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేయవచ్చు అనే విషయాలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు,ఆదర్శ రైతులు తమ అనుభవపూర్వక అంశాలను వివరించారు.ఎల్ నినో నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్లు ఇలా త్రిపాఠి,ఆశిష్ సంగ్వాన్ లు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ....ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు,ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు.రైతు బాగుంటేనే సమాజంలోని అన్ని వర్గాల వారు బాగుంటారని,అందుకే ప్రస్తుత పరిస్థితులను రైతులు సమర్థవంతంగా ఎదుర్కొనేలా వారికి అధికార యంత్రాంగం యావత్తు తోడ్పాటును అందిస్తూ అండగా నిలిచేలా ప్రభుత్వం అన్ని ఉమ్మడి జిల్లాలలో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉన్నత స్థాయిలో సమీక్షలు ఏర్పాటు చేయించిందని తెలిపారు.ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిరక్షిస్తూ,తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్‌పామ్,కందులు,నువ్వులు,వేరుశనగ,పప్పుధాన్యాలు,చిరుధాన్యాలు,కూరగాయలు,ఉద్యాన పంటల సాగును చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు.తీగజాతి,పందిరి కూరగాయల సాగుకు,పాడి పెంపకానికి ప్రభుత్వం నుండి రాయితీ ఇప్పించేలా కృషి చేస్తామన్నారు.అదేవిధంగా ఈ పంటలను కోతులు,అడవి పందులు వంటి వాటి బెడద నుండి కాపాడుకునేందుకు వీలుగా సోలార్ ఫెన్సింగ్ కోసం సబ్సిడీ అందించేలా చొరవ చూపుతామని అన్నారు. కోతులు,అటవీ జంతువులు జనావాసాలలోకి రాకుండా అటవీ ప్రాంతాల్లో విరివిగా పండ్ల మొక్కలు నాటాలని,వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అయితే ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని,భూగర్భ జలాలు రోజురోజుకూ గణనీయంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతుకు భూగర్భ జలాల పరిస్థితి,సాగునీటి లభ్యత,ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు,వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.ఎక్కడ కూడా తాగునీటి కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని,చుక్క నీరు కూడా వృథా కాకుండా ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు.శాసన మండలి సభ్యులు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ....ఎల్ నినో పరిస్థితులు కొత్త కాకపోయినప్పటికీ,దాని ప్రభావం బారి నుండి రైతులను,ప్రజలను కాపాడేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఇప్పటికే 45 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉన్నందున ప్రతీకూల పరిస్తుతులను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను కార్యోన్ముఖులను చేశారు.ప్రస్తుత తరుణంలో పంటల వైవిధ్యం పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని హితవు పలికారు.పరిస్థితులకు అనుగుణంగా పంట విధానాలలో మార్పులు చేయాలని,వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్,కూరగాయలు,ఆరుతడి పంటల సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు.ఇదివరకటి తరహాలో ఉమ్మడి జిల్లాలో చెరకు పంటను ప్రోత్సహించే దిశగా,ఎన్.సీ.ఎస్.ఎఫ్ ఇతర చక్కర పరిశ్రమల పునరుద్ధరణ విషయమై దృష్టిని కేంద్రీకరిస్తామని అన్నారు.ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్,రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా మాట్లాడుతూ....ప్రకృతి వైపరీత్యాలను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని,అయితే ముందస్తుగానే అప్రమత్తమై ప్రత్యామ్నాయ కార్యాచరణను చేపడితే చాలా వరకు విపత్తు ద్వారా చేకూరే నష్టం నుండి బయటపడగల్గుతామని అన్నారు.ఈ దిశగా ప్రభుత్వం అన్ని జిల్లాలలో ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలుకై విస్తృత స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు.వర్షాభావం వల్ల నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో పంటల మార్పిడి వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు.ఉమ్మడి జిల్లాలో ఆదర్శ రైతులు ఉన్నారని,ప్రతీకూల పరిస్థితులను ఎదుర్కోవడంలోనూ వారు సమర్థులేనని అన్నారు.ఇప్పటికే 72 శాతం విస్తీర్ణంలో పంటలు విత్తుకున్నారని,అయితే మిగితా 28 శాతం విస్తీర్ణంలో ఆరుతడి పంటలు వేయాలని హితవు పలికారు.ఈ మేరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు.శాఖల వారీగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించడమే కాకుండా,దానిని పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాలను పెంపొందించేందుకు సోక్ పిట్స్,వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ పెద్ద ఎత్తున నిర్మించేలా చూడాలన్నారు.నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ....ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశామని అన్నారు.పంటల మార్పిడి,ఆరుతడి పంటల సాగుపై రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వనరులతో అధిక ఆదాయాన్ని అందించే పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.అదేవిధంగా ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని,అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేలా అధికారులను సన్నద్ధం చేశామని అన్నారు.కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ....ప్రతీకూల పరిస్థితుల నేపథ్యంలో ఉద్యానవన పంటల సాగు వైపు దృష్టిని కేంద్రీకరిస్తే ఎంతో ప్రయోజనమని అన్నారు.కూరగాయలు,పప్పుదినుసులు,ఆయిల్ పామ్ వంటి పంటల సాగుకు ముందుకు రావాలని రైతులకు పిలుపునిచ్చారు.ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు వల్ల తక్కువ నీటి వసతి,సులభమైన యాజమాన్య పద్ధతులతో దీర్ఘకాలం పాటు అధిక మొత్తం ఆదాయం పొందవచ్చని సూచించారు.అంతర పంటలను సాగు చేసుకునే వెసులుబాటు ఉందని,ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున రాయితీ అందిస్తోందని గుర్తు చేశారు.ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా,టి.లక్ష్మీకాంత్ రావు,పైడి రాకేశ్ రెడ్డిలు మాట్లాడుతూ....తమ నియోజకవర్గాలలో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రస్తావిస్తూ,ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు.రైతులకు ఫసల్ బీమా వర్తించేలా చూడాలని,సబ్సిడీపై విత్తనాలు,డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పించాలని,తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా భూగర్భ జలాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతపై తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి,నూడా చైర్మన్ కేశ వేణు,అదనపు కలెక్టర్లు వి.భుజంగరావు,వెక్టర్,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీ.ఆర్.ఓ గీత,ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చలో అంకాపూర్ ని అడ్డుకున్న పోలీసులు

**నిజామాబాద్, నేటి శుభోదయ :** చలో అంకాపూర్ కార్యక్రమాన్ని నందిపేట్ ఎస్సై వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు.డొంకేశ్వర్ మండల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,నందిపేట్ కాంగ్రెస్ నేతలు,సర్పంచులను ఉదయం 3 గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.దూడ వెంకటేష్,గంగుల బాపూరావు,దేగం గంగారెడ్డి,భూమేష్ రెడ్డి,సాగర్ ధర్మన్న,బట్టు సంజీవరాజ్,సిలిండర్ లింగం,భోజేందర్,జీవన్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# అన్ని పంటలకు బోనస్ ప్రకటించాలి

### ఎల్ నినో ఉమ్మడి జిల్లా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే..



**నిజామాబాద్, నేటి శుభోదయ :** వరితో పాటు ఇతర పంటలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాబావ పరిసితులు నెలకొన్న నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుందన్నారు.ఈ నేపథ్యంలో రైతులకు సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచిస్తుంది కానీ,రాష్ట్రంలో వరి పంటకు బోనస్ ప్రకటించడంతో రైతులు వరిపైనే ముగ్గు చూపుతున్నారన్నారు.దీంతో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఇబ్బందులు తప్పడం లేదన్నారు కావున ప్రభుత్వం ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని సూచించారు.ప్రధానంగా రైతులు సజ్జలు,కందులు,కొర్రలు,కూరగాయలు,ఆయిల్ పామ్ వాటిపై దృష్టి సారించాలని తెలిపారు.అలాగే తెలంగాణలో పీఎం ఫసల్ బీమా యోజన కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.బియ్యం ధరలు కూడా రోజు రోజుకు పెరుగుతున్నాయని గుర్తు చేశారు.కావున వాటిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.నిజాంసాగర్ లో నీళ్లు సరిపడా లేని విషయం తెలిసిందేనన్నారు.కావున జిల్లాలో బినోల నుంచి అలీ సాగర్ వరకు 900 కోట్లతో లిఫ్ట్ చేసిన పంపులను వెంటనే ప్రారంభించాలన్నారు.అలాగే కాలేశ్వరం నుంచి హల్దీ వాగు కు నీటిని లిఫ్ట్ చేసి నిజాంసాగర్ ను నింపాలని తెలిపారు.జిల్లాలో సుమారు 4 లక్షల బోర్లు ఉంటాయని,వాటికి నాణ్యమైన విద్యుత్తును అందజేయాలన్నారు.

## ఖమ్మం కవి మంత్రిప్రగడ శ్రీనివాసరావు కు అంతర్జాతీయ పురస్కారం



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మానికి చెందిన కవి, రచయిత మంత్రిప్రగడ శ్రీనివాసరావు అరుదైన అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ( టి టి ఏ ) మెగా కన్వెన్షన్ మహాసభలు అమెరికాలోని నార్త్ కరోలిన షార్లెట్ లో ఈనెల 17 నుంచి 19 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా, వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సాహిత్య ఎక్స్లెన్సీ పురస్కార పోటీలలో కవితల విభాగంలో శ్రీనివాసరావు ద్వితీయ బహుమతి విజేతగా నిలిచారు. మహాసభలలో ప్రముఖ సినీ గేయ రచయితలు కాసర్ల శ్యామ్, మిట్టపల్లి సురేందర్, జానపద గాన కోకిల డాక్టర్ అరుణ సుబ్బారావు, ప్రముఖ కార్డియాలజిస్ట్, సాహితీవేత్త డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి, టి టి ఏ సాహిత్య సావనీర్ కమిటి చైర్మన్ గూడూరు శ్రీనివాస్, రాజశ్రీ ఇతర కమిటీ సభ్యుల చేతుల మీదుగా ఈ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారంతోపాటు సుమారు 9వేల రూపాయల నగదు బహుమతితో ఆయనను ఘనంగా సత్కరించారు. అమెరికాలో తన కూతురు, అల్లుడు, కుమారుడు ఉండటంతో విజిటింగ్ కి వెళ్లిన శ్రీనివాసరావు ఈ అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకొని, విజేతగా అంతర్జాతీయ వేదికపై ఈ పురస్కారాన్ని అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు సాహిత్యానికి, వికాసానికి, ఇతర సేవా రంగంలో టిటిఏ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కొద్ది కాలానికి ఇక్కడికి విజిటింగ్ గా వచ్చిన తనకు అంతర్జాతీయ వేదికపై ఈ పురస్కారం అందుకోవటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈస్ఫూర్తితో మరింత బాధ్యతతో సాహితీ సేవకు అంకితమవుతానని చెప్పారు.

## సదాశివపేటలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సదాశివపేట పట్టణంలో గత 2 సంవత్సరాలుగా ఇస్కాన్ సంస్థ సభ్యులు మాడిశెట్టి ప్రవీణ్, మార్వాడి వేణు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పూరి జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో సదశివాపేట వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ అధ్యక్షులు గందిగారాజు, కోశాధికారి అమరాధి రచన్న ,కార్య నిర్వహక అధ్యక్షులు అన్మిశెట్టి జయ ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ సురేష్ , శేఖర్, శేఖర్,సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జగన్నాథ స్వామివారి రథాన్ని లాగుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. సదాశివపేట పరిసర ప్రాంతాల్లో కూడా ఇస్కాన్ సేవా కార్యక్రమాలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా సమాజ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం మరియు సనాతన ధర్మ విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. జగన్నాథ స్వామివారి రథయాత్ర విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు మాడిశెట్టి ప్రవీణ్‌తో పాటు ఇస్కాన్ సభ్యులను అభినందించారు.

# ఎవరి ఓట్లు పోవు. అపోహలు వద్దు.



**ఏన్కూర్, నేటి శుభోదయ :** సర్ పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు బిజెపి పార్టీ తిప్పి కొట్టాలని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు .బిజెపి ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ సర్ సమావేశం ఏన్కూరు మండల కేంద్రంలోని తాగూర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సర్ పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పుకొట్టాలని ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. భారతదేశంలోని ప్రతి పౌరుడి ఓట్లు పోవని నకిలీ ఓట్లు చనిపోయిన మాత్రమే తొలగించబడతాయని తెలిపారు. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బి ఎల్ ఏ లు అన్ని బూతులు తిరిగి పనిచేయాలని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నరకుల వెంకటేశ్వర రావు, కిషన్ మూర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరు రమేష్, జిల్లా సీనియర్ నాయకులు మందనపు సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు నరేష్, ఏన్కూర్ వైరా జూలూరుపాడు మండల అధ్యక్షులు మాజీ మండల అధ్యక్షుడు నల్లమోతు రమేష్ ,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వెంచర్ లలో 10 % భూమి మోసాలు







**షాద్నగర్, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం: కోడిచెర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని సన్‌రైజ్ వెంచర్‌లో అనేక అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని గ్రామపంచాయతీ పాలకవర్గం తీవ్ర ఆరోపణలు చేసింది. గ్రామపంచాయతీకి చట్టబద్ధంగా రావాల్సిన 10 శాతం భూమిని ఇప్పటికీ అప్పగించకపోవడం, ప్రభుత్వానికి చెందిన ఒక ఎకరం ఒక గుంట భూమిని సర్వే చేసి గ్రామపంచాయతీకి అప్పగించకపోవడం, గ్రామ క్రీడా ప్రాంగణం రక్షణలో అధికారులు విఫలం కావడం వంటి అంశాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు."వెంచర్‌లో జరుగుతున్న అక్రమాలు అధికారుల కంటికి కనిపించడం లేదా? ప్రజల ఫిర్యాదులు చెవులకు వినిపించడం లేదా?" అని గ్రామపంచాయతీ సభ్యులు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించారు.ఇలాంటి పరిస్థితుల్లో కూడా వెంచర్ యాజమాన్యం ప్లాట్ల విక్రయాలు, కొనుగోళ్లు మరియు ఇతర కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కోడిచెర్ల తండా గ్రామ పంచాయతీ సమావేశంలో పాలకవర్గం ఈరోజు ఏకగ్రీవంగా కీలక తీర్మానం చేసింది. గ్రామపంచాయతీకి రావాల్సిన 10 శాతం భూమిని పూర్తిగా అప్పగించే వరకు, ప్రభుత్వ భూమి ఒక ఎకరం ఒక గుంటకు సర్వే పూర్తి చేసి గ్రామపంచాయతీకి అప్పగించే వరకు, గ్రామ క్రీడా ప్రాంగణాన్ని రక్షించే వరకు సన్‌రైజ్ వెంచర్‌లో ఎలాంటి విక్రయాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు లేదా ఇతర కార్యకలాపాలు జరగకుండా వెంటనే నిలిపివేయాలని తీర్మానించింది.అదేవిధంగా సంబంధిత అధికారులు వెంటనే సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని, గ్రామపంచాయతీకి హక్కుగా రావాల్సిన 10 శాతం భూమిని పూర్తి స్థాయిలో ఇప్పించాలని పాలకవర్గం డిమాండ్ చేసింది.అప్పటి వరకు సన్‌రైజ్ వెంచర్‌లో ఎలాంటి అమ్మకాలు, కొనుగోళ్లు, అభివృద్ధి పనులు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహించకూడదని గ్రామపంచాయతీ బాడీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సమావేశంలో స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ శాంతి నాయక్, ఉపసర్పంచ్ స్వప్న నాయక్, వార్డు సభ్యులు బిచ్య నాయక్, సంతోష్ నాయక్, వినోద్ నాయక్, లలిత నాయక్, శాంతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేటలో అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా భగ్నం..

## -14 క్వింటాల బియ్యం, బోలేర వాహనం స్వాధీనం

**కేశంపేట, నేటి శుభోదయ :** మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఘటనను కేశంపేట పోలీసులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా TS 07 UH 4326 నంబర్ గల బొలెరో వాహనంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వారిలో జంపల్లి గ్రామానికి చెందిన ముదావత్ చౌహాన్ నాయక్ (30), తండ్రి ఈరయ్య, వీరయ్య (60), తండ్రి చాంద్యా ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బియ్యం తరలించినందుకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# రామవరంలో సింగరేణి డిస్పెన్సరీ పునఃప్రారంభం.

## వీకేసీఎంలో నాలుగు నూతన క్రేన్లను ప్రారంభించిన డైరెక్టర్ (పి,పి) కె. వెంకటేశ్వర్లు.





**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :** కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన సింగరేణి డిస్పెన్సరీని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో డిస్పెన్సరీని ఆధునికీకరించి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిస్పెన్సరీలో స్టాఫ్ నర్స్‌ను నిరంతరం అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన మందులు, వైద్య సేవలు ఎల్లప్పుడూ అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు మాట్లాడుతూ, రామవరం డిస్పెన్సరీ పునఃప్రారంభంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం వీకేసీఎం లో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ క్రేన్ల వినియోగంతో గని నిర్వహణ పనులు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు, ఉత్పాదకత కూడా పెరుగుతాయని తెలిపారు. భారీ యంత్ర పరికరాల తరలింపు, నిర్వహణ పనులను సులభతరం చేయడంలో ఈ క్రేన్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధునికీకరణకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో వీకేసీఎం ప్రాజెక్టు అధికారి ఎం.వి. నరసింహరావు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డీజీఎం (ఐఈడీ) యోహాన్, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, రామవరం కార్పొరేటర్ కె. జమలయ్య, ఎస్‌వో టు జీఎం ఎం. గోవిందరావు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ ఉపేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఇన్‌చార్జ్ (సివిల్) కె. రాజారాం, మేనేజర్ (ఐటీజీ) శేషశ్రీ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ హరీష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎనట ీయూసీ ఫిట్ సెక్రటరీ సాగర్, వైద్యాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వాహన చోరీల ముఠాపై నేరేడ్‌మెట్ పోలీసుల ఉక్కుపాదం

## -14 కేసులు ఛేదన.. ఇద్దరి అరెస్టు.. 11 ద్విచక్ర వాహనాల స్వాధీనం





**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అలవాటైన నేరస్థుడితో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో వ్యక్తిని నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్షల విలువైన 11 చోరీ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మొత్తం 14 వాహన చోరీ కేసులను ఛేదించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా అత్వెల్లి గ్రామానికి చెందిన గుడిసె సుశాంత్ అలియాస్ చిన్న (32) కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలు, అప్పులు, వైద్య ఖర్చులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతడు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో వరుసగా వాహనాలను అపహరించి, వాటిని తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.ఈ నెల 16, 17 తేదీల రాత్రి నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో వరుసగా నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన నిందితుడు, సోమవారం బండ చెరువు వైపు చోరీ చేసిన యమహా ఎఫ్‌జెడ్ వాహనంపై వెళ్తుండగా సైనిక్‌పురిలోని భవన్స్ కళాశాల సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో అడ్డుకున్నారు. పోలీసులను గమనించిన నిందితుడు వాహనాన్ని వదిలేసి పరారయ్యేందుకు ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు.నిందితుడిని విచారించగా నేరాలను అంగీకరించాడు. అతడి సమాచారం మేరకు చోరీ సొత్తు కొనుగోలు చేసిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల ద్వారా మనోహరాబాద్, పేట్‌బషీరాబాద్, మేడ్చల్, ఆల్వాల్, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 14 వాహన చోరీ కేసులు ఛేదించినట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను ఇళ్ల ప్రాంగణంలో లేదా భద్రమైన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని, అదనపు తాళాలు ఉపయోగించాలని, స్టీరింగ్ లాక్ వేయాలని, వాహనంలో తాళాలు వదిలి వెళ్లకూడదని, వీలైతే జీపీఎస్ ట్రాకర్ లేదా దొంగతనం నిరోధక పరికరాలు అమర్చుకోవాలని పోలీసులు సూచించారు.పోలీసు బృందాన్ని అభినందించిన అధికారులుఈ కేసులను ఛేదించి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ బృందాన్ని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) అభినందించారు. డీసీపీ చి. శ్రీధర్ (ఐపీఎస్), ఏసీపీ వి. యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో నేరేడ్‌మెట్ స్టేషన్ హౌస్ అధికారి ఎ. వెంకటయ్య ఆధ్వర్యంలో ఉప పరిశీలకుడు జి. చంద్రశేఖర్, సహాయ ఉప పరిశీలకుడు జాకబ్, పోలీసు సిబ్బంది కె. బాలకృష్ణ, ఎ. గౌతమ్ కుమార్, ఈ. జోరాజు, డి. శ్రీనివాస్, కె. ఉదయ్ కిరణ్, చి. రాఘవాచారి తదితరులు కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.

# ఆశ్రమవాసులతో జన్మదిన వేడుకలు.. వికలాంగులకు అన్నదానం, పండ్ల పంపిణీ





**శామీర్ పేట, నేటి శుభోదయ :** జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సమాజానికి ఆదర్శమని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి జగన్‌గూడలోని వికలాంగుల ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమవాసుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను సాదాసీదాగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని వికలాంగులకు స్వయంగా భోజనం వడ్డించి, పండ్లను పంపిణీ చేశారు. ఆశ్రమవాసులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి అవసరాలను తెలుసుకుని, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా అవసరమైన వారికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జాము రవి మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాలు, వికలాంగులు, నిరాశ్రయుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని అన్నారు. జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తే సమాజానికి మంచి సందేశం చేరుతుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, నవీన్, ఆది అజయ్ కుమార్, స్థానిక నాయకులు వెంకట నరసింహారెడ్డి, మురళి గౌడ్, నాగరాజు, నర్సింలు, లక్ష్మణ్, యాదగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమవాసులతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొని వారికి భోజనం వడ్డించి, పండ్లను పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమాన్ని ఆశ్రమ నిర్వాహకులు అభినందిస్తూ చైర్మన్ జాము రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నిర్మించిన మున్నేరు చెక్ డ్యామ్ కూల్చివేతతో నీటి కష్టాలు





**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన తాగునీటి కొరత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, అనాలోచిత, ముందుచూపు లేని పాలనకు ప్రత్యక్ష నిదర్శనమని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం నగర ప్రజలకు శాశ్వత నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై సుమారు రూ.8 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ నిర్మించారని ఆ చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరగడంతో పాటు నగర వ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడి ప్రజలకు తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమైందని బచ్చు తెలిపారు. ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వాడ పై రాజకీయ కక్షసాధింపుతో ప్రకాశ్ నగర్ వద్ద మున్నేరు చెక్ డ్యామ్‌ను పూర్తిస్థాయిలో కూల్చివేసిందని దాని ఫలితంగా ప్రస్తుతం ఖమ్మం నగర ప్రజలు నీటి నిల్వలు కోల్పోతున్నారని తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో వరద ముంపు నివారణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన మున్నేరు వాగుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, మరోవైపు అదే ప్రాంతంలోని చెక్ డ్యామ్‌ను కూల్చివేయడం ద్వారా ప్రభుత్వం అసలు ఏ ప్రయోజనం సాధించిందని ప్రశ్నించారు. వరద నివారణ చర్యలు కొనసాగుతూనే నీటి నిల్వకు ఉపయోగపడే నిర్మాణాన్ని తొలగించడం పూర్తిగా ప్రణాళికా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు మేలు చేసే చెక్ డ్యామ్‌ను తొలగించి నగరంపై నీటి కరువును కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఆహ్వానించిందని విమర్శించారు.ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సంరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం మాజీ మంత్రి పువ్వాడ హయాంలో నిర్మించిన ప్రజోపయోగ నిర్మాణాలను ధ్వంసం చేయడానికే పరిమితమైందని అభివృద్ధి చేయడం చేతకాక, గత ప్రభుత్వ పనులను కూల్చివేయడమే ఈ ప్రభుత్వ పాలనగా మారిందని విమర్శించారు.ఎల్‌నినో దృష్ట్యా తాగునీటి నిల్వలను పెంచడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయడం, చెరువులు, వాగులు, చెక్ డ్యామ్‌లను సంరక్షించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దాని ఫలితంగా ఖమ్మం నగరం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ఖమ్మం నగర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమగ్ర తాగునీటి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని మున్నేరు వాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

### -నిజమైన ఓటర్లకు అన్యాయం జరిగితే సహించేది లేదు



**షాద్ నగర్, నేటి శుభోదయ :** ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బీఎల్ఓలు సంబంధిత అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మీసాల ఆరోగ్యం, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండు సురేష్ సూచించారు నిజమైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మీసాల ఆరోగ్యం,బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండు సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ఫారాల్లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారువారు మాట్లాడుతూ ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించి నమోదు చేయాలని అవసరమైన చోట కొత్త ఫొటోలను అతికించాలని తెలిపారు ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దుకోవడంతో పాటు అర్హులైన కొత్త ఓటర్ల నమోదుకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలని వారు స్పష్టం చేశారు ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉండటం చట్టవిరుద్ధమని తెలిపారు నిబంధనలకు విరుద్ధంగా ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు కలిగి ఉంటే చట్టపరమైన చర్యలు జరిమానా శిక్షకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారునిజమైన ఓటర్ల హక్కులను కాపాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారుఈ కార్యక్రమంలో బీఎల్ఓ మైలారం సుజాతతో,బీఆర్ఎస్ నాయకులు మైలారం దయానంద్,సుధాకర్ రెడ్డి, నర్సింలు,జగన్,పద్మారావు,అశోక్, వినీత్,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఛాంపియన్షిప్ 2026





**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ** యోగా అనేది ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన శారీరక,మానసిక,ఆధ్యాత్మిక అభ్యాసం.ఇది 'యుజ్' అనే సంస్కృత పదం నుండి వచ్చింది.దీని అర్థం కలపడం లేదా ఏకం చేయడం.ఇది మనస్సు, శరీరం,ఆత్మల మధ్య సమతుల్యతను సాధించడానికి సహాయపడుతుంది. ముఖ్యమైన విషయాలు:ఆసనాలు,శారీరక దృఢత్వం,వశ్యత,ఆరోగ్యానికి తోడ్పడే భంగిమలు.ప్రాణాయామం.శ్వాసపై నియంత్రణ సాధించడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందడం.ధ్యానం..ఏకాగ్రతను పెంచి,ఒత్తిడిని తగ్గించి మనస్సును కేంద్రీకరించడం.యోగా వల్ల కలిగే ప్రయోజనాలు:ఒత్తిడి నివారణ,రోజువారీ యోగాభ్యాసం ఒత్తిడిని ఆందోళనను తగ్గిస్తుంది.ఆరోగ్య మెరుగుదలగు రక్తపోటును అదుపులో ఉంచుతుందన్నారు.రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది.శారీరక బలం,కండరాలను బలపరుస్తుందన్నారు.వెన్నుముకను దృఢంగా ఉంచుతుంది.యోగా గురించి మరింత సమాచారం తెలుసుకోవడానికి,మీ జీవనశైలికి తగినట్లుగా మార్పులు చేసుకోవడానికి భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ లేదా జాన్స్ హాప్కిన్స్ మెడిసిన్ అధికారిక వెబ్‌సైట్లను సందర్శించవచ్చు.మీకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా లేదా మీరు బిగినర్ (కొత్తగా నేర్చుకునేవారు) అయితే,దానికి తగ్గట్టుగా ఎలాంటి ఆసనాలు వేయాలో నేను సూచించగలను.మీకు ఏ రకమైన యోగా గురించి తెలుసుకోవాలని ఉందన్నారు.అనంతరంతెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఛాంపియన్షిప్2026 వారి ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు.ఇందులో భాగంగా పురుషుల సీనియర్ పోటీ విభాగంలో పాలమాకుల గ్రామానికి చెందిననీళ్ళ శ్రీధర్ గౌడ్ కు జిల్లా ప్రథమ స్థానం సర్టిఫికెట్ తో పాటు బంగారు పతకం అందుకోవడం జరిగిందన్నారు.నాకు శిక్షణ ఇచ్చి జిల్లా స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచేల చేసిన మా గురువు కట్ట మల్లేష్ గౌడ్ ను ప్రోత్సహించినటువంటి నాతోటి మా పాలమాకుల గ్రామయోగా సాధకులకు నా మిత్రులకు శ్రేయోభిలాషులకు అందరికి శుభాకాంక్షలు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి




**నిజామాబాద్, నేటి శుభోదయ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్షకు సంఘీభావంగా హంగర్ స్ట్రైక్ చేపట్టిన భారత ప్రముఖ శాస్త్రవేత్త,విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు.ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్ కుమార్,పిడిఎస్యు నగర అధ్యక్షుడు నసిర్ మాట్లాడుతూ....దేశంలో ప్రజాస్వామ్య హక్కులు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను వినిపించే విద్యార్థులు,యువత,మేధావులపై అక్రమ కేసులు బనాయించి,అరెస్టులతో ఉద్యమాలను అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని,పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్‌తో విద్యార్థులు నెల రోజులుగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ,వారి సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా ఉండడం బాధాకరమన్నారు.విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా నిరాహార దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని,ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్యలను దేశ ప్రజలు సహించరని అన్నారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేసి,పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నగర సహాయ కార్యదర్శి సృజన్,తెలంగాణ యూనివర్సిటీ నాయకులు నితిన్,హేమాంజలి,శ్రీశాంత్,భాను,అర్జున్,హర్షితలతో విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షంరాక కోసం శివాలయంలో వరుణయాగం శివలింగానికి ప్రత్యేక పూజలు





**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని శివాలయంలో వర్షం కురవాలని ఆదేవుని వేడుకుం టూ శివలింగానికి ప్రత్యేక పూజలు వరుణ యాగం కార్యక్రమం ఏర్పాటు చేశారు గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ గ్రామపంచాయతీ పాలకమండ లి సభ్యులు గ్రామస్థులతో కలిసి శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం వరుణ యాగం లో పాల్గొన్నారు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్ మాట్లాడుతూ సమ యానికి వర్షాలు కురవక రైతులు వర్షం కోసం ఎదురు చూస్తూ ఆందోళన చెందుతున్నారు పంట లు వేశారు వర్షాలు లేవు ఎలా జీవనం గడిచేది ఎలా రైతులు ఆవేదన చెందుతున్నారు అనిఅ న్నారు వర్షాల కోసం ఆనాడు దేవతలు యాగం చేయడం వల్ల వర్షాలు పడేవి అని పురాణంలో ఉన్నది అనే నమ్మకంతో నమ్మకంతో.అందుకే దేవుడి కటా క్షం కోసం వర్షం పడాలని వరణ యా గం ఏర్పాటు చేశాం అని అన్నారు ఈయాగం శుక్రవారం వరకు జరుగుతుంది అన్నారు ఈ సం దర్భంగా ఆలయ కమిటీసభ్యులు మాడుగుల కృష్ణగౌడ్ మాట్లాడుతూ వరుణయాగం శుక్రవా రం వరకు కొనసాగుతుంది యాగం పూజలో కూర్చునేవారు దంపతులతో వచ్చి యాగం పూజ లు పాల్గొనాలని అన్నారు ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాముల గురుస్వామి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ శివస్వాముల గురుస్వామి నూకంనగేష్ ముదిరాజ్ సొసైటీ డైరెక్టర్ కొంగర జనార్ద న్ రెడ్డి వార్డుసభ్యుల పున్నం రాము.దంపతులు మాడుగుల బాలమణి కృష్ణగౌడ్ ,మొగ్రిపద్మ ఐలయ్య ,గ్రామస్తులు గుడ్డిమల్ల చంద్రయ్యముదిరాజ్ ,దంపతులు దంటు మధుసూదన్ రెడ్డి, దంపతులు వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ,ప్రజాగలం దామెరభూపాల్ తదితరులు పాల్గొన్నా రు.

## వర్షాభావ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన



**మధిర, నేటి శుభోదయ :** వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా పత్తి, మిర్చి తదితర పంటలను సాగు చేసిన రైతులు ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నాటిన పత్తి మొక్కలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.అడపాదడపా కురుస్తున్న వర్షాలు కూడా అన్ని ప్రాంతాల్లో కాకుండా కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో పంటలకు తగినంత తేమ అందడం లేదు. దీంతో పంటల పెరుగుదల మందగించి, ఇప్పటికే రైతులు విత్తనాల కోసం దుక్కి దున్నడం కోసం వేల రూపాయలు ఖర్చు చేశారు. దిగుబడులపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందా అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. వర్షాభావం కొనసాగితే పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తొందరపడి అదనపు విత్తనాలు వేయకుండా, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అవసరమైన వ్యవసాయ సలహాలను పాటించాలని సూచిస్తున్నారు. అధిక వర్షం పడ్డ ప్రాంతాల్లో రైతులు యూరియాను వేసేందుకు సిద్ధమవుతున్నారు. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురవాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ప్రజావాణిలో 25 ఫిర్యాదులను స్వీకరించిన అదనపు డి.సి.పి



**నిజామాబాద్ , నేటి శుభోదయ :** నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు అదనపు డి.సి.పి (అడ్మిన్) శుభం ప్రకాష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ,సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజా సమస్యల పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

## ఇంకుడు గుంతలు నిర్మిద్దాం వర్షపు నీటిని సంరక్షిద్దాం



**షాద్నగర్, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని మల్లాపురం గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంతలు భూగర్భ జలాలు పెంపొందించి భవిష్యత్ తరాలకు భరోసానిచ్చేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తున్నామని ఎంపీడీవో సిహెచ్ అరుంధతి అన్నారు. సోమవారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంకుడు గుంతలు వర్షపు నీటిని వృధా కాకుండా భూమి లోకి పంపడం వల్ల వేసవిలో నిటి సమస్య తలెత్తకుండా భూగర్భ జలాలు , పెంపొందించడం గురించి ఇంకుడు గుంతలు నిర్మించాలి అనే సర్పంచి అన్నారు వ్యర్థాల ఉత్పత్తి కంపోస్టు తయారీకోసం ఏర్పాటుచేసిన కేంద్రాన్ని పరిశీలించి ఎంపీడీవో అరుంధతి తో కలిసి సర్పంచ్ ప్రారంభించారు.అలాగే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇంట్లో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే చెత్తను ఇంట్లోనే వేరు చేసి బుట్టల ద్వారా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని వారు సూచించారు.చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా మల్లాపూర్ డంపు యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు,ఇతర వస్తువులను డీఆర్‌సీసీకి తరలించాలన్నారు.తడి చెత్తను స్థానికంగా ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు.పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని వారు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సుహాసిని,ఎంపీఓ కృష్ణ కాంత్ రెడ్డి,సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి,ఉప సర్పంచ్ స్వరూప,సెక్రటరీ విక్రం రెడ్డి, వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి,స్వాతి రాజేష్, సురేందర్ రెడ్డి,వరుణ్ గౌడ్,చిర్ర ప్రశాంత్, సంతోష,నాయకులు పాపిరెడ్డి,పెంటా రెడ్డి,దామోదర్ రెడ్డి,మురళీధర్ రెడ్డి,శేఖర్ రెడ్డి,విట్టల్ రెడ్డి,కమల్ రెడ్డి,చిర్ర సుదర్శన్,చిర్ర యాదయ్య, రాజు, పాల్గొన్నారు.

## మృతుని కుటుంబనికి ఉప్పల ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేత

### -సర్పంచుల సంఘం అధ్యక్షుడు స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్

**తలకొండపల్లి, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల కేంద్రంలో బండి బుచ్చమయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది,విషయం తెలుసుకున్న ఉప్పల చారీటబుల్ ట్రస్ట్ అధినేత మిషన్ భగీరథ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటేష్ మృతుల కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసి ఆ కుటుంబానికి 3,000 రూ రూపాయలు,మృతుల కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య మాజీ సింగిల్ విండ డైరెక్టర్ పోతుగంటి యాదయ్య,ఉప సర్పంచ్ నూకం కోటిశ్వర్ ముదిరాజ్,వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, కనుక వెంకటయ్య, మల్లేశ్వరి జంగయ్య,రవికుమార్,రాములు, డాక్టర్ రమేష్,ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.



## కబ్జాకు గురవుతున్న గ్రామ కంఠం భూములను ప్రభుత్వమే రక్షించాలి

### -సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి పగడాల యాదయ్య

**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలో కబ్జాగురైన గ్రామ కంఠ భూమిని ఇళ్లస్థలాలకు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ దండుమైలారం గ్రామంలో జనార్దన్ రెడ్డి కబ్జా చేసిన గ్రామ కంఠ భూమిని ఇంటి స్థలాలకు కేటాయించాలన్నారు. నిజాం నవాబు కింద భూస్వామిగా ఉన్న తంగడపల్లి అనంతరెడ్డి గ్రామంలో 500 ఎకరాల పట్టాదారన్నారు. దున్నేవానికి భూమి కావాలని జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో అనంతరెడ్డి దండుమైలారని వదిలి వెళ్లాడన్నారు. కబ్జాకు గురైన భూమిలో భూస్వామి అనంతరెడ్డి గెస్ట్ హౌస్ నిర్మించారు. అందులో వెట్టి చాకిరి చేయని వారిపై అనేక కఠినమైన శిక్షలు విధించే వారిని ఆవేదన వ్యక్తం చేశారు. దండుమైలారం ప్రాంత నుంచి 1955 సంవత్సరంలో వెళ్లిపోయిన అనంతరెడ్డి ఆస్తులను దండుమైలారం గ్రామానికి చెందిన తాడూరు నారాయణరెడ్డి ఆక్రమించారన్నారు. అనంతరం తన కుమారుడైన తాడూరు జనార్దన్ రెడ్డి అధీనంలో ఉందన్నారు. జనార్దన్ రెడ్డి కబ్జాలో ఉన్న గ్రామ కంఠ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలన్నారు. 2007 సంవత్సరంలో దాదాపు 200 మందికి దండుమైలారంలో ఇండ్ల స్థలాల ప్రభుత్వం పట్టాలు మంజూరు చేశారు. ఇప్పటికీ స్థలం కేటాయించలేదు వారికి ఈ గ్రామ కంఠ భూమిని కేటాయించాలి. ఇంకా ఇంటి స్థలాలు లేని నిరుపేదలను గుర్తించి అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు చాతళ్ల జంగయ్య, జగన్, మండల కమిటీ సభ్యులు గుడేటి జంగయ్య, లింగస్వామి, సిపిఎం నాయకులు యాదగిరి, కాకి రమేష్, కాస మల్లేష్, మంకు జంగయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.



## అంజనాపురంలో గోద్రెజ్ ఆగ్రో ఫామ్ కంపెనీ ప్రారంభోత్సవం

**వరంగల్, నేటి శుభోదయ :** వైరా నియోజకవర్గం కొనిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నిర్మించిన గోద్రెజ్ ఆగ్రో ఫామ్ కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై కంపెనీని ప్రారంభించారుఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించే ఇటువంటి సంస్థలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు టీపీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంజనాపురం గ్రామంలో ఈ సంస్థ ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కొరకు ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు1న మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

### : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్)

**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజేంద్రనగర్ లో ఉ పాధ్యాయులు, ఉ ద్యోగులు, పెన్ష న ర్ల సమస్యల పరిష్కారం కొరకు ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు1న మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేసిన రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్,రాజేంద్రనగర్ ★ కాంప్లెక్స్ హెడమాస్టర్ జూపల్లి,శ్రీనివాస రావు,తపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కె.హనుమంత్ రావులు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రెడ్డి,మండల మహిళా కన్వీనర్ విజయమ్మ, ఉపాధ్యక్షురాలు,నాగరాణి,తపస్ సభ్యులు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తపస్ ఉద్యమ కార్యాచరణ డిమాండ్స్.. పిఆర్సి రిపోర్ట్ తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలి.పెండింగ్ లో ఉన్నటువంటి 6 డి ఏ లను వెంటనే క్లియర్ చేయాలి . పెండింగ్ బిల్లును సత్వరం చెల్లించాలి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి.సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలి. ఎస్ఎస్ఏ,కేజీబీవీ ఉపాధ్యాయినీల 29రోజుల సమ్మె శాలరి చెల్లిస్తూ ఎంటియస్ ను మంజూరు చేయాలి.మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దును అమలు చేయాలి.జిహెచ్ఎం ఆపై స్థాయి ప్రమోషన్లకు ప్రత్యేక కార్యాచరణను,ప్రత్యామ్నాయ మార్గాలను ప్రకటించాలి.అన్ని రకాల గురుకుల గిరిజన ఆశ్రమ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల,పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలోనే అన్ని గ్రాంట్స్ లను చెల్లించాలి.జూలై 31 కట్ ఆఫ్ డేట్ గా నిర్ణయిస్తూ,ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ప్రమోషన్ బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలి.190 జీఓ ప్రకారం అప్పీల్ చేసుకున్న ఉపాధ్యాయులందరికీ ఉత్తర్వులు ఇవ్వాలి.2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి,టెట్ అర్హత మార్కులు 40శాతం గా నిర్ణయం చేయాలని తెలిపారు.



## ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొందాం




**సంగారెడ్డి నేటి శుభోదయ :** ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి,మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు.ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.అనంతరం మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు.అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## కుల సంఘాలు బలోపేతం కావాలి
### -బీసీలలో చైతన్యం రావాలి



**వనపర్తి, నేటి శుభోదయ :** కుల సంఘాలు బలోపేతం కావాలని, బీసీ వర్గాలలో ఆత్మగౌరవ చైతన్యం కలగాలని వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా శాలివాహన సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సూగూరు రామును పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. వృత్తి పనులనే నమ్ముకుని సమాజ పురోగతికి తోడ్పడుతున్న కుమ్మరులు మట్టిలో మాణిక్యాలని కొనియాడారు. జిల్లాలోని నూరుకు పైగా ఉన్న బీసీ సంఘాల నాయకులు, వారిచే ఎన్నుకోబడిన అధ్యక్ష, కార్యదర్శులందరూ బీసీ నినాదంతో ఒక్కటై సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీసీల ఆత్మగౌరవ పోరాటాలు, చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాటుపడాలన్నారు.బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా శక్తివంతం చేయడానికి అన్ని సంఘాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని, ముఖ్యంగా యువతను విద్యాభివృద్ధి వైపు మళ్లించేలా దిశా నిర్దేశం చేయాలని ఆయన ఆకాంక్షించారు. చదువుకున్న యువతే రేపటి సామాజిక, రాజకీయ చైతన్యానికి నాంది కాగలరని స్పష్టం చేశారు.శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సూగూరు రామును పలువురు రాజకీయ, సామాజిక నేతలు అభినందిస్తూ సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, బిజెపి నాయకులు రవి, రిటైర్డ్ ఉద్యోగి నరసింహులు, అలాగే రాజనగరం రామస్వామి, శివకుమార్, జయ రాములు, చందు యాదవ్, రాము, సాయి కుమార్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం..

**శేరిలింగంపల్లి , నేటి శుభోదయ :** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమని, ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన తీవ్రమైన కుంభకోణమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అసలు సూత్రధారులను కాపాడుతూ, న్యాయం కోరుతున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగానికి పాల్పడటం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై లాఠీలు ఎత్తడం సిగ్గుచేటని అన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశ యువతకు నాణ్యమైన, పారదర్శకమైన విద్యా వ్యవస్థను అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, కానీ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, అవినీతి, నిర్లక్ష్యంతో విద్యార్థుల విశ్వాసాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు.విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పోలీసుల దౌర్జన్యంపై స్వతంత్ర విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.

## జగదాంబ తండా పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ -ఎస్ఎంసీ కమిటీ ఎన్నిక



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సిరికొండ మండలం జగదాంబ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ విద్యా సామగ్రికి ఏఈ తిరుపతి ఆర్థిక సహాయం అందించారు. గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాలవత్ సుగుణ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.అనంతరం పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (SMC) ఎన్నిక నిర్వహించగా, కమిటీ సభ్యులుగా రమేష్, హేమ, వినోద్ తదితరులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి , పంచాయతీ సెక్రటరీ పాషా, ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు నితిన్, మంజుల, మహిపాల్, గంగాధర్, వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.. అధికారంలో ఉండి రైతులకు అన్యాయం చేయడం నీకు తగునా..?



**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :** అధికారంలో ఉండి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయకుండా వారి పక్షాన నిలబడ్డందుకు మా నాయకులపై అవకులు చెవాకులు పేల్చడం ఎమ్మెల్యే స్థాయికి తగునా అని శంషాబాద్ టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆరోపించారు.సోమవారం శంషాబాద్ టౌన్బీఆర్ఎస్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో బహదూర్ గూడ భూములు హైడ్రా ద్వారా ఆక్రమించబడిన దానిపై విలేకరుల సమావేశంలో వివరించడం జరిగిందన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..నీన్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రైతుల పక్షాన ముసలి కన్నీరు కార్చుటం,ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా తప్పించుకొని తిరుగుతున్న నందుకు ప్రశ్నించడం జరిగిందన్నారు.అంతేకాకుండా ఎమ్మెల్యేగా ప్రకాష్ గౌడ్ మీరు ఈరోజు అధికార పార్టీలో ఉండి మా నాయకులు సబితా ఇంద్ర రెడ్డి,కార్తీక్ రెడ్డిలు రైతుల పక్షాన నిలబడ్డందుకు కించపరిచే విధంగా మాట్లాడడం తగునా అని ప్రశ్నించారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులని కించపరిచే విధానం ప్రశ్నించడం మీ రాజకీయ నీతికి నిదర్శనం అన్నారు.ఎకరాకు 500 గజాలు లేదా 600 గజాలు ఇస్తానడం విడ్డూరం అనిపించట్లేదా అని నిలదీశారు.దీనికి బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.ప్రజల పక్షాన ఎల్లప్పుడూ మా పార్టీ పోరాటం చేసి న్యాయం జరిగిందాకా రైతుల సమక్షన నిలబడి తీరుతామని ఆయన హెచ్చరించారు.మేము రైతుల పక్షాన హైకోర్టులో కేసు దాఖలు చేశాము దానికి రైతుల పక్షాన స్టేటస్ కి ఆర్డర్ వచ్చిన దానికి హైకోర్టు న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.ఇదే మాట వాళ్లకి ధైర్యాన్ని నింపి మేమున్నాం అని చెప్పడం జరిగిందన్నారు.కార్యక్రమంలో శంషాబాద్ టౌన్ మహిళా అధ్యక్షులు మడపతి పరమేశ్వరి,ప్రధాన కార్యదర్శి రాహుల్ గాజుల,బిసి సెల్ అధ్యక్షులు అరజున్,ఆర్గనైజ్ సెక్రటరీ జయ సింహ,జై కృష్ణ-లీగల్ సెల్యూత్ అధ్యక్షులు టిల్లు,ఉపాధ్యక్షులు గడ్డమీద యాదగిరి,హరి గౌడ్,మందాడి వేణు గౌడ్,యాదగిరి,శీను నాయక్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి , నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి నియోజక వర్గం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు సోమ వారం రోజు వైశాలినగర్ లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిమానుల కోలాహలం తో ప్రారంభమైన సంబరాలు అంబరాన్ని అంటాయి. పూలమాలలు వేసి బొకేలు అందిస్తూ శాలువా లతో సత్కరించి ఆయనకి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో శేరిలింగంపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , మాజీ కార్పొరేటర్ రంగా రావు, గోప రాజు శ్రీనివాస్ రావు,సంగారెడ్డి, బాబుమోహన్ మల్లేష్, దీప్తి రాజు, బి ఎస్ ఎన్ కిరణ్ యాదవ్, ధాత్రి నాథ్ గౌడ్, శ్రీనివాస్, బండి రామకృష్ణ గౌడ్, గణేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అనిల్ రెడ్డి, యాదయ్య, శేఖర్ యాదవ్ తదితరుల తో పాటు నియోజక వర్గం ప్రముఖులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

## పెంజర్ల గ్రామ అభివృద్ధి నా యొక్క కృషి

**షాద్నగర్ , నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో కాంగ్రెస్ తోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. సోమవారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో ఎమ్మెల్యే నిధుల నుండి రూ.ఏడు లక్షలతో గ్రామపంచాయతీ నుండి హనుమాన్ టెంపుల్ వరకు సిసి రోడ్ పనులను సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిడి భారతమ్మ,కటికే మైబూజి, గ్రామస్తులు డీలర్ రాజేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్,కాం



గ్రెస్ నాయకులు మామిడి అర్జున్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,ఆకనపల్లి సహదేవ్,డి బుచ్చయ్య,కే పెంటాజి, గ్రామస్తులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అంబటి ప్రభాకర్ నియామకం

**షాద్నగర్ , నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు మండల సీనియర్ నాయకులు... రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్ బి పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. సుదీర్ఘకాలంగా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అధిష్టానం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నూతన పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. నన్ను గుర్తించి ఈ కీలక పదవిని ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్న గారికి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి గారికి, జిల్లా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులు నర్సింహా రెడ్డి గారికి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి గారికి, నియోజకవర్గ మండల ముఖ్య నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంబటి ప్రభాకర్ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వెల్జాల్ లో ఇందిరమ్మ ఇంటి కి స్లాబ్

- -ప్రారంభించిన వెల్జాల్ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు

**తలగొండపల్లి, నేటి శుభోదయ :** ఖ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిరుపేదలకు ఇల్లు కట్టించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపడుతుంది.స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఇల్లు లేని ప్రతి పేదవారికి విడతల వారీగా ఇల్లు మంజూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా,కల్వకుర్తి నియోజకవర్గం,తలకొండపల్లి మండలం,వెల్జాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా సోమవారం ఆయిల్ పెంటమ్మ భర్త పేరు శ్రీహరి గౌడ్ ఇంటి స్లాబ్ పనులను ప్రారంభించిన వెల్జాల్ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు పి అశోక్ బాబు, బి నర్సింలు,టి.కృష్ణయ్య గౌడ్,పులిజాల విష్ణు,ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి మాజీ ఎంపీటీసీ అంబాజీ,మాజీ ఉప సర్పంచ్ అజీజ్,నాయకులు



లకు మల్ల మల్లేష్, ఏం డి యూసుఫ్, వద్దే రాజు,టీ లచ్చయ్య గౌడ్, బి శ్రీనివాసులు, ఆఫ్తాబ్, కే శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ.. ఈనెల 27న జర్నలిస్టులు కదిలి రావాలి

**వరంగల్, నేటి శుభోదయ** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు హక్కుల స్వేచ్ఛను కాల రాస్తూ జర్నలిస్టుల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి జక్కుల విజయ్ కుమార్, బొట్ట స్వామి దాస్ అన్నారు. మంగళవారం వరంగల్ 13వ డివిజన్ దేశాయిపేట నందు టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య ఆదేశాలమేరకు రాష్ట్రంలో ఉన్నటువంటి యూనియన్ కమిటి జర్నలిస్టుల సభ్యులందరూ ఈ నెల 27న చలో ఢిల్లీకి తరలి కావాలని రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలు పరిష్కార సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల పైన జరుగుతున్న దాడులు వృద్ధ జర్నలిస్టులకు పెన్షన్ అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, రాష్ట్రంలో పూర్తి ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు ఈనెల 27న దేశ రాజధాని న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వివిధ రాష్ట్రాల ( ఐఎఫ్టియు) అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఉవ్వెత్తున



ఉద్యమించి హక్కుల సాధనకు బయలుదేరుతున్నారని ఈ సమావేశం కు దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు నేతలు విచ్చేస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని విజయ్ కుమార్ స్వామి దాస్ పిలుపునిచ్చారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పాలడుగుల సురేందర్ ఉపాధ్యక్షుడు వెల్లి రాజేందర్ సహాయ కార్యదర్శి రాంపల్లి శ్రీనివాస్ సభ్యులు ఆకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు యోగా పిల్ విచారణకు అనుమతి

**ఖమ్మం లీగల్, నేటి శుభోదయ :** యోగా పిల్ ను విచారణకు అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఖమ్మం కోర్టులో మిఠాయిలు పంపిణీలు కార్యక్రమం జరిగింది.యోగవిద్యను కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యాంశంగా చేర్చాలని యోగ శిక్షకులను 50 వేల గౌరవ వేతనంతో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయికి యోగ శిక్షకులను నియమించాలని, యోగా మినిస్ట్రీ ఏర్పాటు చేయాలిని హైకోర్టులో తెలంగాణ యోగ సంఘ రాష్ట్ర అధ్యక్ష సేవక్ హైదరాబాద్ లాఫ్టర్ నేషనల్ యూనివర్సిటీ ఫౌండర్, న్యాయవాది మరికంటి వెంకట్ పిల్ దాఖలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎడ్లపల్లి రమేష్ న్యాయవాదులు కేఎల్ నరసింహారావు, సుదర్శన్, పాముల దానయ్య, బిల్లా క్రాంతి, ఆకుల శేఖరబాబు, నారాయణ స్వామి, బాబు, చింతల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కె ఎస్ పి వ్యవస్థాపకులు కొలిచలం పూర్ణచంద్ర రావుని మర్యాదపూర్వకంగా కలిసిన కెఎస్పి అధ్యక్షులు గుమ్మడిదల వెంకటనారాయణ

**వైరా, నేటి శుభోదయ :** కుమ్మరి శాలివాహన ప్రజాపతి కె ఎస్ పి అధ్యక్షులు గుమ్మడిదల వెంకటనారాయణ వైరాలోని నివాసంలో ఈరోజు కె ఎస్ పి వ్యవస్థాపకులు కొలిచలం పూర్ణచంద్రరావు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా తన నివాసానికి విచ్చేసిన పూర్ణచంద్రరావు కి గుమ్మడిదల వెంకటనారాయణ పుష్ప గుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పూర్ణచంద్ర రావు ని, వారి ధర్మపత్ని రాజేశ్వరి ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె ఎస్ పి వైరా సభ్యులు విలాసాగరం నరేష్, విలాసాగరం పుల్లారావు తో పాటు మహిళా విభాగం ప్రతినిధి కొలిచలం గీత పాల్గొన్నారు.



## భార్యపై కత్తితో దాడి చేసిన భర్త





**ఏన్కూర్, కొణిజర్ల, నేటి శుభోదయ :** భార్యపై భర్త కత్తితో దాడి చేసిన మండల కేంద్రమైన ఏన్కూరు పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. ఏన్కూరు ఎస్ఐ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని ఎర్రబోడు తండాకు చెందిన భూక్య రాంబాబు తన భార్య రజిని పై కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాలు ఈ ఘటనకు దారితీసినట్లు సమాచారం. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో రజిని తన పుట్టింటైన సాతానిగూడెం గ్రామంలో ఉంటోంది. ఇదిలా ఉండగా, గ్రామ సంఘం ద్వారా తీసుకున్న రుణం చెల్లించాలని సంఘ సభ్యులు ఒత్తిడి చేయడంతో రజిని ని ఏన్కూరులోని ఎస్బీఐ బ్యాంకుకు తీసుకువచ్చారు.ఈ విషయం తెలుసుకున్న భర్త రాంబాబు బ్యాంకు వద్దకు వచ్చి రజినితో వాగ్వాదానికి దిగాడు. దీంతో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ 100కు డయల్ చేయగా పోలీస్ సిబ్బంది ఆమెను పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. రజిని పోలీస్ స్టేషన్ కు పోలీసులు తీసుకెళ్లారని సమాచారం తెలుసుకొని రాంబాబు పోలీస్ స్టేషన్ కు చేరుకుని తన వద్ద ఉన్న కత్తితో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. రజిని ఎడమ భుజం, ఎడమ చేతి మణికట్టు భాగంలో కత్తితో పొడవడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఏన్కూరు పోలీసులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్సై సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .దాడికి గల పూర్తి కారణాలు, కుటుంబ వివాదాలపై విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. పోలీస్ స్టేషన్లో జరిగిన ఈ ఘటనతో ఏన్కూరు పోలీస్ స్టేషన్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించిన అధికారులు.



**చింతకాని, నేటి శుభోదయ :** చింతకాని మండల పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేయడం, అభ్యంతరాలు మరియు మార్పులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం వంటి అంశాలపై అధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, బీఎల్ఓ సూపర్వైజర్, సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగందానలో గడ్డి వాములకు దుండగుల నిప్పు

### - 150 గడ్డి కట్టలు దగ్ధం, కేసు నమోదు



**కేశంపేట, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని లింగందాన గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పంటించడంతో సుమారు 150 గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేశంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల కథనం ప్రకారం, లింగందాన గ్రామానికి చెందిన రైతు నాగిళ్ల నర్సింహ (65), తండ్రి పెంటయ్య సోమవారం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు, ఈ నెల 19వ తేదీ సాయంత్రం తన పశువులకు మేత వేసి ఇంటికి వెళ్లిన అనంతరం, 20వ తేదీ తెల్లవారుజామున సుమారు 4.30 గంటలకు తన గడ్డి వాములకు మంటలు అంటుకున్నాయని సమాచారం అందింది. వెంటనే పొలానికి వెళ్లి చూడగా, తనకు చెందిన సుమారు 100 గడ్డి కట్టలు ఉన్న రెండు గడ్డి వాములు పూర్తిగా కాలిపోయినట్లు గుర్తించారు.అదే ఘటనలో పక్కనే ఉన్న రైతు నాగిళ్ల కృష్ణయ్యకు చెందిన సుమారు 50 గడ్డి కట్టలు కూడా మంటల్లో దగ్ధమైనట్లు తెలిసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే గడ్డి వాములకు నిప్పంటించి ఈ నష్టం కలిగించినట్లు ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో ఇలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## చిన్నమారురు లిఫ్టులో కాపర్ చోరీ..

### నిందితులను అరెస్టు చేయాలి







**చిన్నంబావి , నేటి శుభోదయ :** వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారురు లిఫ్టులో కాపర్ (రాగి) చోరీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్ డిమాండ్ చేశారు. చిన్నమారురు లిఫ్టును లక్ష్యంగా చేసుకుని పదేపదే దొంగతనాలు జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. లిఫ్టు వద్ద తక్షణమే సెక్యూరిటీని ఏర్పాటు చేయడంతో పాటు, సిసి కెమెరాలను అమర్చాలని కోరారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరామని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. ఆది, కుమార్, దర్గా స్వామి, వెంకటస్వామి తదితరులు

## నాణ్యతలేని చెప్పులను అమ్మినందుకు

## 5000 రూపాయలో పరిహారం ఇవ్వాలని

### ఖమ్మం వినియోగదారుల కమిషన్ తీర్పు

**ఖమ్మం, నేటి శుభోదయ :** కేస్ నెంబర్. సిసి /25/2026సెంట్రో కంపెనీ వి /ఎస్ లింగాల ప్రవీణ్. వినియోగదారుల కు పాదరక్షలు నాణ్యత లేకుండా అమ్మినందుకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పునిచ్చారు. సోమవారం జరిగిన వాదాప వాదనలు విన్న తర్వాత వినియోగదారుల పరిష్కార కమిషన్ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా వినియోగదారుల తరపు న్యాయవాది బెల్లంపల్లి నరేంద్ర స్వరూప్ కేసు వివరాలను వివరించారు. ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన లింగాల ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయవాద క్లర్కు గా పనిచేస్తున్నారు. కోర్టు సమీపంలో ఉన్న సెంటర్ సెంట్రో షోరూమ్ ప్రకటనలను చూసి ప్రభావితం అయ్యి ఆగస్టు నెల 2025 న రూపాయలు 1, 599 రూపాయల వెచ్చించి పాదరక్షలను (చెప్పులను) కొనుగోలు చేశారు. రెండు మూడు సార్లు ఉపయోగించ గానే చెప్పులు సోల్ లెదర్ డామేజ్ అయి చెప్పుల మధ్యలో కట్ అయింది. ఈ విషయమై ఫిర్యాదు దారు సెంట్రో చెప్పుల షోరూం నాణ్యతలేని చెప్పులు అందజేసినట్టు తద్వారా ఇబ్బందిని పరిశీలించి పాదరక్షలు (చెప్పులు) మరలా కొత్తవి ఇవ్వాలని లేదా తాను చెల్లించిన డబ్బులను వాపస్ కానీ ఇవ్వాలని వారిని కోరడం జరిగింది. ఈ విషయమై పలుసార్లు సెట్రో షోరూమ్ యజమాని సంప్రదించిన వినియోగదారుని షోరూం యజమాని ఖాతరు చేయలేదని, అవహేళన చేశారని బాధితుడు వాపోయాడు. న్యాయవాదులు వెల్లంపల్లి. నరేంద్ర స్వరూప్, కోలికొండ శరత్ బాబుల ద్వారా ఖమ్మం జిల్లా వినియోగదారులకు వివాదాల పరిష్కారాల కమిషన్ సంప్రదించగా వారు కేసు పూర్వ పరాలను పరిశీలించి వాదోపవాదనలు విన్న తరువాత వినియోగదారుని పాద రక్షలకు అయిన కొనుగోలు చేసిన ఒక వెయ్యి ఐదు వందల తొంబై తొమ్మిది రూపాయలను చెల్లించవలసిందిగా ఫిర్యాదుదారుల కైన ఇబ్బందులకు గాను ఐదు వేల రూపాయలను, కోర్టు ఖర్చులకు మరో ఐదు వేల రూపాయలను రూపాయలను 45 రోజుల్లోపు చెల్లించవలసిందిగా ఖమ్మం జిల్లా వినియోగదారుల ఫోరం మెంబర్లు ఏ.మాధవి లత , వి. లలితలు ఆదేశాలు జారీ చేశారు.నాణ్యత లేకుండా పాదరక్షలను తయారుచేసి అమ్ముతూ వినియోగదారులను ఆకర్షించేలా చేస్తూ తదుపరి ఇక్కట్లు గురి చేసే వస్తువులు అమ్ముతున్న వారి పై కొరడా ఝుళిపించారు. వస్తువు కొనుగోలు చేసిన తర్వాత వారంటీ గ్యారెంటీలను ఇవ్వవలసిన బాధ్యత తయారు చేసిన యాజమాన్యంపై ఉంటుందని, తొలుత సదరు సెంట్రో షోరూమ్ ఆశ్రయించగా వారు కొత్త పాదరక్షలకు చెల్లించిన ధరను తిరిగి ఇచ్చేందుకు నిరాకరించారని జాప్యం చేశారని సెంట్రో షోరూమ్ చుట్టూ ప్రదక్షిణలు చేసేలా ప్రవర్తించారనిఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కు ఫిర్యాదుదారులు తమ న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ.శరత్ బాబు, తోట రామాంజనేయులు లు న్యాయవాదులు ద్వారా నివేదించారు. కాగా కేసుని పరిశీలించి చెల్లించవలసిందని తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుకు అయిన వ్యాజ్య ఖర్చులు నిమిత్తం ఐదు వేల రూపాయలు మరియు వేదనకు గురి చేసినందుకు గాను మరో ఐదు వేల రూపాయలు మొత్తంగా 10 వేల రూపాయలను ఫిర్యాదుదారు కు 45 రోజుల్లోపు చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుని తరపున వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ.శరత్ బాబు, తోట రామాంజనేయులు లు న్యాయవాదులు గా ఈ కేసును జిల్లా కమిషన్ లో నమోదు చేసి, వాదనలు వినిపించారు.

## న్యాయ వ్యవస్థ పై అవగాహన కార్యక్రమం







**ఖమ్మం నేటి శుభోదయ :** జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థినులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా సంస్థల చట్టం, సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాలు, పిల్లల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్ట్స్ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, చరిత్ర, రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి అంశాలు పరిపాలన, న్యాయశాఖ, సివిల్ సర్వీసులు, బోధన, జర్నలిజం తదితర రంగాల్లో ఉన్నత అవకాశాలకు పునాది అని తెలిపారు.విద్యార్థినులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే అధికారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ప్రజా సేవకులుగా ఎదగాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఓటు ఎంతో విలువైనది : బిఆర్ ఎస్ నాయకులు



**ఖమ్మం, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు ఎంతో విలువైనది అని బిఆర్ ఎస్ జిల్లా నాయకులు జోగుపర్తి ప్రభాకర్ రావు తెలిపారు. ఖమ్మంజిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశానుసారం నాలుగవ డివిజన్ 62 బూతులో సర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాలుగవ డివిజన్ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు జోగుపర్తి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు సమక్షంలో, నాయకులు కంచర్ల దయాకర్ పాల్గొన్నారు. ఓటరు రిజిస్ట్రేషన్ చేసిన వారి పేర్లు(1) మంద ప్రసాద్ (2) మంద దుర్గా (3) ముందా ధనుష్ (4) మంద శంకర్(5) మంద సౌజన్య(6) మంద మౌనిక. వీరి ఓటును ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.

## మార్షల్ ఆర్ట్స్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభినందనలు



**సంగారెడ్డి ప్రతినిధి , నేటి శుభోదయ :** మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మాల్వే విహాన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా విహాన తన తల్లిదండ్రులు రామేశ్వర్, అశ్విన్‌తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి సంగారెడ్డి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు.భవిష్యత్తులోనూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, వసంత్ రెడ్డి తదితరులు పాల్గొని చిన్నారిని అభినందించారు..

## ఎల్-నినో ప్రభావంపై సమీక్షా సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**సంగారెడ్డి ప్రతినిధి , నేటి శుభోదయ :** సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను నిలదీశారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎల్–నినో ప్రభావ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు... ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గానికి మంజూరైన నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలంటే సబ్‌స్టేషన్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్‌ఈ, నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.అలాగే సదాశివపేట పట్టణంలోని 8, 9 వార్డుల పరిధిలోని సిద్ధాపూర్ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అమృత్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొంటూ, పనులను వేగవంతం చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని కోరారు.వేసవి పరిస్థితులు, ఎల్–నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.

## బహదూర్ గూడ భూములపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు హైకోర్టు.



**5రాజేంద్ర నగర్ , నేటి శుభోదయ :** బహదూర్ గూడ భూములపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్ గూడ గ్రామంలోని సర్వే నంబర్లు 3,4లో ఉన్న 28 ఎకరాల భూమి తమదేనంటూ రైతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.పిటిషన్ను విచారించిన హైకోర్టు,పిటిషనర్లకు సంబంధించిన భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టవద్దని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.ఈ ఆదేశాలతో బహదూర్గూడ రైతుల్లో కొంత మేరకు సంతోషం కలిగిందన్నారు.వి పరిస్థితులు, ఎల్–నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.


Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620